

మునిసిపల్ వైస్‌చైర్మన్లపై అవిశ్వాస నోటీసు తిరస్కరణ

- కలెక్టర్ నిర్ణయం తీసుకున్నట్టు కమిషనర్ వెల్లడి

ఎలమంచిలి, మే 16 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ వైస్‌చైర్మన్లపై 16 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ ఇటీవల ఇచ్చిన నోటీసును జిల్లా కలెక్టర్ శుక్రవారం తిరస్కరించినట్టు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ వెంకట గోవిందరాజు నాగేశ్వరరావు, ఆరెపు నాగ త్రినాథ ఈశ్వర గుప్తాలపై అవిశ్వాసం ప్రకటిస్తూ, చైర్‌పర్సన్ రమాకుమారితోపాటు 16 మంది కౌన్సిలర్ల సంతకాలతో... మిగతా 8వ పేజీలో



చోడవరం మండలం అంబేరుపురం వద్ద గోతుల్లో వర్షం నీరు చేరి చెరువును తలపిస్తున్న బీఎన్ రోడ్డు

బీఎన్ రోడ్డు మరింత ఛిద్రం

కొద్దిపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్న గోతులు

- ప్రయాణికుల ఒళ్లు హూనం
- ద్విచక్ర వాహనచోదకులు సర్కస్ ఫీట్లు
- ప్రమాదంగా మారిన ప్రయాణం



ఇబ్బంది పడుతూ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు

చోడవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): చాలా కాలం నుంచి అత్యంత దారుణంగా వున్న భీమిలి- నర్సీపట్నం (బీఎన్) రోడ్డు.. ప్రస్తుత వర్షాలతో మరింత ఛిద్రం అవుతున్నది. కొద్ది రోజుల నుంచి చెదురు మదురుగా కురుస్తున్న వేసవి వర్షాలతో చోడవరం- వెంకన్నపాలెం మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా గోవాడ నుంచి వెంకన్నపాలెం వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మూడు జిల్లాల రవాణాకు ప్రధాన మార్గం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాము బీఎన్ రోడ్డులోనే ... మిగతా 8వ పేజీలో



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వద్ద రహదారి దుస్థితి

పెరిగిన విద్యుత్ వినియోగం

అంతరాయం లేకుండా సరఫరా

- ప్రతి శుక్రవారం నిర్వహణ పనులు
- ఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) టీవీ సూర్యప్రకాశ్



టీవీ సూర్యప్రకాశ్

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి ప్రయత్నిస్తున్నామని ఈపీడీసీఎల్ డైరెక్టర్(ఆపరేషన్స్) టీవీ సూర్యప్రకాశ్ తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, వేసవి ఎండల కారణంగా విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని, దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని కొరత రాకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరాలో ఊహించని ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లకు ప్రతి శుక్రవారం నిర్వహణ పనులు చేపడుతున్నామని, అందులో భాగంగా శుక్రవారం కొన్నిచోట్ల అంతరాయం ఏర్పడిందన్నారు. అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల గురువారం రాత్రి పెనుగాలులతో వర్షం కురిసిందని, దీంతో మాడుగుల మండలం సత్యవరంలో 20 ఎల్‌టీ స్తంభాలు, ఏడు హెచ్‌టీ స్తంభాలు విరిగి పడిపోయాయని ఆయన చెప్పారు. డి.గొట్టివాడ, సాగరం, కొత్తవలస, కె.వేలంపాడు గ్రామాల్లో 1,600 సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందన్నారు. వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి శుక్రవారం ఉదయం పది గంటలలోకల్లా సరఫరాను పునరుద్ధరించామన్నారు.

విశాఖలో లోడ్ మానిటరింగ్ సెల్

విద్యుత్ సరఫరాలో వచ్చే అంతరాయాలను గుర్తించేందుకు విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయంలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షిస్తున్నామని సూర్యప్రకాశ్ చెప్పారు. డివిజన్ స్థాయిల్లో సైతం ఇలాంటి మానిటరింగ్ సెల్స్ పనిచేస్తున్నాయని, విద్యుత్ సమస్యలు ఏమున్నా 1912 నంబరుకు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు.


భూ సమీకరణలో గోల్‌మాల్!

ప్రభుత్వ భూమి.. రైతుల సాగులో ఉన్నట్టు రికార్డుల్లో నమోదు

- 'సమీకరణ' నిబంధనలు ఉల్లంఘన
- కూటమికి చెందిన ఓ నేత, రెవెన్యూ అధికారులు, బినామీ రైతులు కుమ్మక్కు
- ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లింపునకు డివిజన్‌స్థాయి అధికారి గ్రీన్ సిగ్నల్
- ఆర్డీఓ కార్యాలయం నుంచే కదిలిన ఫైలు
- 31.38 ఎకరాలకు రూ.6.27 కోట్లు చెల్లింపు
- అక్రమాలపై సీఎంకు వామపక్షాల ఫిర్యాదు



అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం



కోడూరులో సర్వే నంబరులో 20లో ప్రభుత్వ భూమిగా చూపుతున్న మీభూమి వెబ్‌సైట్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

భూ సమీకరణ పరిహారం చెల్లింపుల ముసుగులో నిధులు స్వాహా అవుతున్నాయి. అనకాపల్లి రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని అడ్డాగా చేసుకొని కొంతమంది పాలక పెద్దలు ఇటీవల గుట్టుగా సాగించిన భూసమీకరణ పరిహారం చెల్లింపుల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కూటమి నేతల అండదండలతో భూ సమీకరణ నిబంధనలను పక్కన పెట్టి బినామీలకు పరిహారాన్ని దోచి పెట్టారు.

అనకాపల్లి మండలం కోడూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 20లోని 39 ఎకరాల 38 సెంట్ల ప్రభుత్వ భూమి 2009లో ఏపీఐఐసీకి దఖలు పడింది. అయితే ఈ భూమిని తొమ్మిది కుటుంబాలకు చెందిన 34 మంది సాగు చేస్తున్నట్టు రికార్డులు సృష్టించి, రూ.6.27 కోట్లు పరిహారం చెల్లించడం చర్చనీయాంశంగా మారింది. రెవెన్యూ అధికారులు, కూటమిలో ఒక పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, బినామీ రైతులు కుమ్మక్కై నిబంధనలను తుంగలో తొక్కారు. భూ సమీకరణ నిబంధనలను పక్కనపెట్టి, కోట్లాది రూపాయలు పరిహారంగా విడుదల చేయించారు. దీనిపై 'నాడు అక్రమం.. నేడు సక్రమమా?' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

వాస్తవానికి భూసమీకరణ చట్ట నిబంధనల ప్రకారం స్థానికంగా ఉంటూ ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న నిరుపేద రైతులకు మాత్రమే పరిహారం చెల్లించేందుకు గ్రామ సభలు నిర్వహించి అర్హులుగా ఎంపిక చేయాలి. కానీ అధికారులు నిబంధనలు పాటించలేదు. గ్రామ సభ నిర్వహించలేదు. కోడూరులోని 20వ సర్వే నంబరులో ఇతర మండలాలకు చెందిన రైతుల పేర్లను, సుమారు 40 నుంచి 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న వారి పేర్లను చేర్చారు. అక్కడ నుంచి వచ్చి సాగు చేసుకొని వెళుతున్నట్టు రికార్డుల్లో నమోదు చేసి పరిహారం చెల్లించినట్టు తెలిసింది. అంతే కాకుండా 10 నుంచి 15 ఏళ్ల కిందట పెళ్లి అయి, భర్తతో కలిసి ఇతర ప్రాంతాల్లో నివాసం వుంటున్న ఇద్దరు మహిళలకు పరిహారం మంజూరు చేసినట్టు సమాచారం. వాస్తవానికి పరిహారం చెల్లింపుల వివరాలు, అర్హుల జాబితా, ఎవరికి ఎంత చెల్లించారనే వివరాలు ప్రభుత్వ ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. కానీ అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయంలో కోడూరులో 20వ సర్వే నంబరు భూసమీకరణ లావాదేవీలకు సంబంధించిన రికార్డులు ఏవీ అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. కూటమి నేతల ఒత్తిళ్లతకు తలొగ్గిన అధికారి ఒకరు ఫైలుపై సంతకం చేసి వ్యక్తిగత సెలవుపై వెళ్లినట్టు తెలిసింది.

ఆర్డీఓ కార్యాలయమే అడ్డాగా....

కోడూరులోని సర్వే నంబరు 20లో భూ సమీకరణ కింద భూములు ఇచ్చిన తొమ్మిది కుటుంబాలకు చెందిన 34 మందికి అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయ అధికారులు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున 31 ఎకరాల 38 సెంట్లకు సుమారు రూ.6.27 కోట్లు ఈ నెల 10వ తేదీన విడుదల చేశారు. మిగిలిన ఎనిమిది ఎకరాలకు ఇంకా చెల్లించాల్సి ... మిగతా 8వ పేజీలో

మినీ స్టేడియం అధ్వానం

నిర్వహణను గాలికొదిలేసిన మునిసిపల్ అధికారులు

- మందుబాబులు, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిన మైదానం
- వైసీపీ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో విధ్వంసం
- ఆక్రమణకు గురవుతున్న స్టేడియం స్థలం



వాకింగ్ ట్రాక్‌పై మార్బుల్ వ్యర్థాలు

నర్సీపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, ఆరోగ్యాన్ని పది మందికి అందించే నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నిర్వహణను మునిసిపల్ అధికారులు గాలికొదిలేశారు. బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. వైసీపీ పాలనలో వ్యవహరించినట్టే కూటమి పాలనలో కూడా అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నర్సీపట్నం మునిసిపాలిటీ ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో సేదతీరడానికి, పిల్లలు సరదాగా ఆడుకోవడానికి సరైన పార్కు ఒక్కటి కూడా లేదు. దీంతో పిల్లలు, క్రీడాకారులు ఆడుకోవడానికి, వ్యాయామం చేసుకోవడానికి, మధ్య వయస్కులు, వృద్ధులు వాకింగ్‌కు ఎన్టీఆర్ మినీ స్టేడియంను ఆశ్రయించాల్సి వస్తున్నది. గతంలో వేసిన మొక్కలు ఇప్పుడు చెట్టుగా ఎదగడంతోపాటు కాసేపు సేదతీరడానికి బెంచీలు, క్రీడా మైదానం ఉండడంతో ఉపశమనం చెందుతున్నారు. మహిళలు, యువతీ యువకులు, క్రీడాకారులు, సీనియర్ సిటిజన్స్ నిత్యం వందల సంఖ్యలో వస్తుంటారు. సెలవు దినాల్లో క్రీడా మైదానం సందడిగా వుంటుంది. వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతుంటారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలను స్టేడియానికి తీసుకొచ్చి ఆడించి, వారు కూడా కాసేపు వ్యాయామంచేసి ఇంటికి వెళుతుంటారు. అప్పుడప్పుడు రాజకీయ సభలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదిక అవుతుంది. ఇన్ని విధాలుగా ఉపయోగపడుతున్న ఎన్టీఆర్ మినీ స్టేడియం తీవ్రనిర్లక్ష్యానికి గురవుతున్నది.

వైసీపీ హయాంలో విధ్వంసం

గత వైసీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ మినీ స్టేడియం అభివృద్ధికి ఏ మాత్రం కృషి చేయకపోగా.. బాగున్నదాన్ని పాడు చేశారు. రోడ్డు విస్తరణ పనుల కోసం స్టేడియం ... మిగతా 8వ పేజీలో



స్టేడియం స్థలంలో ఆక్రమణలు

మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై ఉక్కుపాదం

రాష్ట్ర హోం మంత్రి అనిత నక్కపల్లిలో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో హోం మంత్రి అనిత, జనసేన నేత గెడ్డం బుజ్జి, టీడీపీ నాయకులు కాశీనాయుడు, చిట్టిబాబు, వెంకటేశ్, అబద్ధం, బుజ్జి, తదితరులు

నక్కపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు ఉగ్రమూకలు, వాటిని పెంచి పోషిస్తున్న శక్తులు కుట్రలు పన్నుతున్నాయని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం సాయంత్రం ఉపమాక హైవే జంక్షన్ నుంచి నక్కపల్లి పాఠశాల వరకు నియోజకవర్గం కూటమి నాయకులతో కలిసి 'తిరంగా ర్యాలీ' నిర్వహించారు. త్రివర్ణ పతాకాలతో భరతమాతకు జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించే వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పాదం మోపుతాయని ఆమె హెచ్చరించారు. పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పి, భారత్‌కు విజయాన్ని అందించిన త్రిదళాలకు ఆమె కృతజ్ఞతలు ... మిగతా 8వ పేజీలో

పెళ్లి బృందానికి తప్పిన ప్రాణాపాయం

అన్నవరం నుంచి వస్తుండగా డివైడర్‌ను ఢీకొన్న కారు

- అదుపుతప్పి.. రోడ్డుకు అవతల వైపునకు దూసుకుపోయి బోల్తా
- బెలూన్‌లు ఓపెన్ కావడంతో తప్పిన ముప్పు
- నవదంపతులతోసహా ఐదుగురికి గాయాలు





ప్రమాదానికి గురైన కారు (ఇన్‌సెట్‌లో) గాయపడిన యువతి

నక్కపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహ దారిపై స్థానిక సారిపల్లివానిపాలెం వద్ద శుక్రవారం మధ్యాహ్నం పెళ్లి బృందానికి పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. కశింకోట మండలం నూతనగుంటపాలెంలో గురువారం రాత్రి కలిగట్ల వినయ్, యామినికి వివాహమైంది. కొంతమంది బంధువులతో కలిసి నవదంపతులు కారులో శుక్రవారం ఉదయం అన్నవరం వెళ్లారు. అక్కడ వ్రతం, దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా, నక్కపల్లి మండలం సారిపల్లివానిపాలెం జంక్షన్ వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొన్నది. అంతటితో ఆగకుండా పక్క లేన్‌లోకి దూసుకుపోయి బోల్తాపడింది. అదృష్టవశాత్తూ కారులో బెలూన్‌లు ఓపెన్‌కావడంతో నవ దంపతులపాటు కారులో వున్న ఎల్.వైష్ణవి, ఎ.ఆషా, డి.రోషిణి గాయాలతో బయటపడ్డారు. కారు తీవ్రంగా దెబ్బతిన్నది. నక్కపల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం నూతనగుంటపాలెం వెళ్లిపోయారు. ఈ ప్రమాదానికి సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

- 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహణ

అనకాపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. హాల్ టికెట్లను విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. జిల్లాలో రెగ్యులర్ 2,480 మంది విద్యార్థులు, ప్రైవేటు 712 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

ఆయా తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు 19 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. 19 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, 19 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. ప్రతి కేంద్రం పరిధిలో ఇన్విజిలేటర్లను నియమించి వారికి ఇప్పటికే శిక్షణ తరగతులు నిర్వహించారు.

సీల్డ్ కవర్‌లో డిప్యూటీ మేయర్ పేరు!

- అభ్యర్థి ఖరారు బాధ్యత చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లదే..
- నలుగురి పేర్లను ప్రతిపాదించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు







విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఎంపికకు సంబంధించి సీల్డ్ కవర్ సంస్కృతిని అమలు చేయనున్నారు. డిప్యూటీ మేయర్ పోస్టు కోసం టీడీపీ, జనసేన మధ్య గట్టిపోటీ నెలకొనడంతో రెండు పార్టీల అధినేతల సూచన మేరకు అభ్యర్థి పేరును సీల్డ్ కవర్‌లో విశాఖకు పంపనున్నారు. డిప్యూటీ మేయర్‌గా ఎవరిని ఎంపిక చేయాలన్నది విశాఖలోనే తేల్చుకోవాలని ఎమ్మెల్యేలకు, మేయర్‌కు మూడు రోజుల క్రితమే సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ జనసేన పార్టీ గట్టిగా పట్టుబట్టడంతో ఎంపిక అనేది తేలికగా అయ్యే పని కాదని టీడీపీ నేతలకు అర్థమైంది. డీసీసీబీ చైర్మన్ పదవిని జనసేనకు చెందిన కోన తాతారావుకు కేటాయించడంతో డిప్యూటీ మేయర్-1 పదవిని టీడీపీ తీసుకోవాలని ఎమ్మెల్యేలు యోచిస్తున్నారు. అవసరమైతే డిప్యూటీ మేయర్-2 పోస్టును జనసేనకు కేటాయించేలా ఆ పార్టీ నేతలను ఒప్పించాలని భావిస్తున్నారు. ఇదే విషయం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆమోదంతో టీడీపీ నుంచి ఒక పేరును ఎంపిక చేసుకోవాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో టీడీపీ నుంచి గొలగాని మంగవేణి, మొల్లి హేమలత, గంధం శ్రీనివాసరావు ... మిగతా 8వ పేజీలో

కస్తూర్బా జూనియర్ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోసయ్యపేట కస్తూర్బా బాలికల జూనియర్ కళాశాలలో ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీలను అభివృద్ధి చేయడంతో పాటు, విద్యార్థినులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు చెప్పారు. వీటిని విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని తద్వారా విద్యాలయాలకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. అంతకు ముందు రూ.18.5లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షుడు బి.శ్రీరామదాసు, పార్టీ మహిళా నేత శ్రీవేణి, బీజేపీ నాయకుడు సన్యాసినాయుడులతో పాటు పలువురు కూటమి నాయకులు, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సైనికుల కుటుంబాలకు ఘన సత్కారం

▸▸ చైర్‌పర్సన్ రమాకుమారి వెల్లడి ▸▸ విజయవంతానికి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, మే 16 (ఆంధ్రజ్యోతి) : దేశానికి సేవలందిస్తున్న సైనికుల కుటుంబీకులను సత్కరించడంతో పాటు వారి ఇళ్లకు వెళ్లి మనో.ధైర్యాన్ని నింపేందుకు శనివారం ఇక్కడ నిర్వహించ తలపెట్టిన 'మన సైనికులు- మన కుటుంబం' కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి పిలుపునిచ్చారు. మునిసిపల్ కార్యాలయం ఆవరణలో పట్టణ ప్రజలతో పాటు మాజీ సైనికులు, వర్తక, వ్యాపారులు, విశ్రాంత ఉద్యోగులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా దేశభక్తిని రానున్న తరానికి ఇనుమడింపజేయాలని కోరారు. మునిసిపాలిటీలో నివశిస్తున్న సైనికుల కుటుంబీకుల ఇళ్లకు ర్యాలీగా వెళ్లి, వారి తల్లిదండ్రులతో పాటు కుటుంబీకులను సత్కరిస్తామన్నారు. అలాగే, వారి ఇళ్లపై జాతీయ జెండాను ఆవిష్కరించి వారిలో మరింత మనోధైర్యాన్ని నింపుతామని వివరించారు. మునిసిపాలిటీలో వివిధ వార్డుల్లో ఉన్న సైనిక కుటుంబాల కోసం ఆరు బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం ఎనిమిది గంటలకు మునిసిపల్ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభం కానుందన్నారు. పెద్ద సంఖ్యలో అంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు సైనికులు మాట్లాడుతూ మునిసిపాలిటీలో రానున్న తరం సైనికుల్లో చేరేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు తాము సిద్ధమని, అయితే మైదానంలో తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ ఆడారి పూరీజగన్నాథం, విశ్రాంత సైనికుడు నక్కా శివశంకర్, మునిసిపల్ అధికారులు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించే వరకు గ్రామాన్ని విడిచి వెళ్లం

▸▸ కృష్ణంపాలెం పంచాయతీ శివారు నారప్పపాలెం నిర్వాసితుల డిమాండ్ ▸▸ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న ఎస్‌ఈజడ్ నిర్వాసితులు

రాంబిల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కృష్ణంపాలెం పంచాయతీ శివారు నారప్పపాలెం గ్రామానికి చెందిన ఎస్‌ఈజడ్ నిర్వాసితులు శుక్రవారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కశిరెడ్డి ప్రసాద్‌తో పాటు పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ స్పెషల్ ఎకనామిక్ జోన్ నిమిత్తం తీసుకున్న తమ గ్రామాన్ని తరలించేందుకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.8.36 లక్షలు ఇస్తామని అధికారులు ఇటీవల నిర్వహించిన గ్రామ సభలో ప్రకటించారన్నారు. ఇందుకు తాము అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. తమకు రూ.25లక్షల ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇదే ప్యాకేజీని ఇంట్లో మేజర్‌లుగా ఉన్న కుమారులు, కుమార్తెలతో పాటు వివాహం జరిగిన వారికి కూడా వర్తింపజేయాలన్నారు. తమ గ్రామాన్ని అచ్యుతాపురం మండలం రావిపాలేనికి తరలిస్తామని చెప్పారని, కానీ వెంకటాపురం బీసీటీ వద్ద స్థలం సేకరించి పునరావాసం కల్పించాలని కోరారు. అదేవిధంగా కొత్తగా ఇక్కడకు వచ్చే కంపెనీల్లో నిర్వాసిత గ్రామంలోని కుటుంబాల్లో వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామంలోని పైడితల్లి అమ్మవారి ఆలయానికి సంబంధించి 7.45 ఎకరాల భూమికి ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు గ్రామాన్ని విడిచి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నిర్వాసితులు పాల్గొన్నారు.

సోమలింగపాలెంలో పెళ్లింట విషాదం

▸▸ లైటింగ్ సిబ్బందికి ఇనుప పైపు అందిస్తుండగా షాక్

▸▸ హాజరైన బంధువు మృతి

ఎలమంచిలి, మే 16 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని ఓ గ్రామంలో పెళ్లింట విషాదం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి. సోమలింగపాలెంలో గురువారం ఓ ఇంట్లో వివాహ వేడుకకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ శుభకార్యానికి విచ్చేసిన కొయిలాడ చినఅప్పలనాయుడు (29)అనే వ్యక్తి లైటింగ్ సిబ్బందికి ఇనుప పైపును అందిస్తున్న సమయంలో పైపు విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో అతడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అప్పలనాయుడుకు ఈ ఏడాదే వివాహమైంది. దీంతో ఆ ఇంట విషాదం అలముకుంది. ఈఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గ్యాస్ ట్యాంకర్ బోల్తా



బోల్తా పడిన ట్యాంకర్

ఎలమంచిలి, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగుపాలెం సమీపం పెట్రోల్ బంకు ఎదురుగా జాతీయ రహదారి పక్కన గురువారం రాత్రి ప్రమాదవశాత్తూ గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ఘటన గురించి తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులను వెంటనే అప్రమత్తమయ్యారు. డ్రింక్‌లలో ఉపయోగించే గ్యాస్ కావడంతో ప్రమాదం జరగలేదని వారు తెలిపారు.

డెంగ్యూపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ



అచ్యుతాపురం మండలం హరిపాలెంలో పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ



మునగపాక మండలం మూలపేటలో....

అచ్యుతాపురం రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ రవిబాబు, డాక్టర్ షకీనా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమ కాటు వలన తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాలనొప్పి, శరీరంలో ఎర్రని దద్దుర్లు, అధిక దాహం వంటి లక్షణాలు కనిపిస్తే దీనిని డెంగ్యూగా గుర్తించాలన్నారు. వెంటనే తగిన చికిత్సలు పొందితే ఎటువంటి ప్రమాదం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఎటువంటి వ్యాధులు దరిచేరవని ఇక్కడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.విమలగిరి అన్నారు. డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మునగపాక, మూలపేట తదితర గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించి మాట్లాడారు. ఈ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ ర్యాలీలో సీహెచ్‌వో ఆర్.దేవకాంత, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'కార్మిక సమ్మె జూలై 9కి వాయిదా'

ఎలమంచిలి, మే 16 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఈనెల 20వ తేదీన నిర్వహించ తలపెట్టిన కార్మికవర్గం సమ్మె జూలై తొమ్మిదో తేదీకి వాయిదా పడినట్టు మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు శుక్రవారం తెలిపారు. తొలుత ఇక్కడ మునిసిపల్ కార్మికులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సమ్మె వాయిదాకు గల కారణాలను వివరించారు.

'ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



కూలీలతో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన రోజువారీ కూలి రూ.307లను కొలతలతో సంబంధం లేకుండా చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కొండకర్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఐదు వారాల కూలి డబ్బులను వెంటనే విడుదల చేయాలన్నారు. కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, రెండు వందల రోజుల పనిదినాలు కల్పించాలని, ఐదు కిలోమీటర్ల దూరం పనులకు వెళితే రానుపోను చార్జీలు ఇవ్వాలని, ప్రతి వారం వేతనాలు చెల్లించాలని కోరారు. ఏటా నిధులు తగ్గించడం వలన జాబ్ కార్డులు తగ్గిపోతున్నాయన్నారు. కూలీలు పోరాడితేనే తమ హక్కులను సాధించుకోగలరన్నారు.

రాష్ట్ర స్థాయి వూషూ టోర్నీలో నర్సీపట్నం క్రీడాకారులకు పతకాలు

నర్సీపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వూషూ టోర్నమెంట్‌లో 13 పతకాలు సాధించిన నర్సీపట్నం క్రీడాకారులను రూరల్ సీఐ రేవతమ్మ శుక్రవారం అభినందించారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు కర్నూలు లోని శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపంలో స్టేట్ వూషూ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సీనియర్స్ విభాగంలో డి.అక్షయరాణి, లక్ష్మీపార్వతి, దివాకర్, సబ్ జూనియర్స్ విభాగంలో ఎస్.శ్రీరామ్ నిహాల్, పి.ప్రణీత్ బంగారు పతకాలు సాధించారు. జి.సాయి, యు.రవికుమార్ సిల్వర్ మెడల్స్, టి.జగదీశ్, వై.సాత్విక్, ఎం.దుర్గాప్రసాద్, ఎం.హర్ష, ఎం.సాయిసందీప్, కె.విజయకుమార్ సిల్వర్ మెడల్స్ సాధించారు.

టీడీపీ మండల నూతన కార్యవర్గం



పార్టీ మండల కమిటీని ప్రకటిస్తున్న మంత్రి వంగలపూడి అనిత

కోటవురట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా పెట్ల లింగంనాయుడు ఎన్నికయ్యారు. హోంమంత్రి వంగలపూడి అనిత క్యాంపు కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కార్యకర్తల సూచనలు, సలహాల మేరకు మంత్రి అనిత పాత కార్యవర్గం రద్దు చేసి నూతన కార్యవర్గాన్ని నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడిగా బీకేపల్లి సర్పంచ్ పెట్ల లింగంనాయుడు, ప్రధాన కార్యదర్శిగా కొడవటిపూడి ఎంపీటీసీ సభ్యుడు యలమంచిలి సూర్యప్రకాశ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా లింగంనాయుడు మాట్లాడుతూ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు సూచనల మేరకు పార్టీని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆయుర్వేద ఆస్పత్రి వద్ద యోగా శిక్షణ పొందుతున్న పిల్లలు

నక్కపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే విద్యార్థులు యోగా శిక్షణ పొందితే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ కె.రఘు చెప్పారు. ఆస్పత్రి వద్ద యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులకు శుక్రవారం ఆయన పలు సూచనలు చేశారు. చిన్నప్పటి నుంచి యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాల్లో సాధన చేస్తే వ్యాధులు దరి చేరవన్నారు. పిల్లల్లో చురుకుదనం, జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. పిల్లలకు సూర్య నమస్కారాలు, భుజంగాసనం, ఉష్ట్రాసనం, హలాసనం, సర్వాంగాసనం, సుప్త వజ్రాసనం, ప్రాణాయామంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నరసమ్మ, యోగా శిక్షకులు డి.రాంబాబు, డీఎస్‌వీ సాయి పాల్గొన్నారు.

'కేంద్ర కారాగారంలో అదనపు బ్యారెక్స్ నిర్మాణం'

ఆరిలోవ, మే 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో అదనపు బ్యారెక్స్ నిర్మాణానికి సన్నహాలు చేస్తున్నట్టు కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.10 కోట్లు కేటాయించినట్టు తెలిపారు ఈ నిధులతో సుమారు 200 మంది ఖైదీలకు సరిపడే విధంగా నూతన బ్యారెక్స్ నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు, ఈ భవన నిర్మాణానికి టెండర్లు కూడా పిలవడం జరిగినట్టు తెలిపారు.. దీనిని పోలీసు హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభం ప్రారంభమవుతాయన్నారు. ప్రస్తుతానికి ఈ కేంద్ర కారగారంలో సుమారు 900 మంది ఖైదీలు ఉండడానికి సరిపడుతుందని, కానీ ప్రస్తుతం 1800 మంది ఖైదీలు ఉంటున్నారని తెలిపారు. స్థలాభావం వల్ల రెండు నెలల క్రితం రాజమండ్రికి సుమారు 170 మంది ఖైదీలను పంపినట్టు ఆయన తెలిపారు.

అడ్డరోడ్డులో హోం మంత్రి అనిత సందడి

▸▸ జంక్షన్‌లో మినీ మహానాడు స్థల పరిశీలన

▸▸ టీ స్టాల్‌లో మహిళలతో సరదాగా ముచ్చట



టీ స్టాల్ నిర్వహిస్తున్న మహిళతో ముచ్చటిస్తున్న మంత్రి వంగలపూడి అనిత



అడ్డరోడ్డు సమీపంలో మినీ మహానాడు సభాస్థలాన్ని పరిశీలిస్తున్న హోం మంత్రి

ఎస్. రాయవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యాపార కేంద్రమైన అడ్డరోడ్డు జంక్షన్‌లో శుక్రవారం రాత్రి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఓ సాధారణ మహిళలా సందడి చేశారు. ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న మినీ మహానాడు కార్యక్రమానికి సంబంధించిన సభా స్థలాన్ని పరిశీలించడంతో భాగంగా అడ్డరోడ్డు జంక్షన్‌లో ఉన్న ఓ టీ స్టాల్ వద్ద ఆగి టీ తాగుతూ అక్కడ కొంత సమయం సరదాగా గడిపారు. టీ స్టాల్ నిర్వహిస్తున్న మహిళతో అనిత సరదాగా ముచ్చటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీంతో టీ స్టాల్ మహిళా నిర్వాహకురాలు తమకు పక్కా గృహం కావాలని హోం మంత్రిని కోరగా, దానికి ఆమె సానుకూలంగా స్పందించారు. టీ స్టాల్ నిర్వాహకురాలకు పక్కా గృహం మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి అనిత ఆదేశించారు. అలాగే అక్కడున్న స్థానికులతో సరదాగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హోం మంత్రి ఒక్కసారిగా ఆగి సాధారణ మహిళలా టీ స్టాల్ వద్దకు వచ్చి సరదాగా ముచ్చటిస్తూ టీ తాగడాన్ని గమనించిన స్థానికులు ఎంతో సంతోషంతో వెళ్లి ఆమెతో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, సీనియర్ నేత గుర్రం రామకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీలు



పాయకరావుపేటలో డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

పాయకరావుపేట రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురంలో డెంగ్యూపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.సంకీర్తన మాట్లాడుతూ డెంగ్యూ లక్షణాలు, నివారణా చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిశీలించడం-శుభ్రం చేయడం-మూతలు పెట్టడం పద్ధతులను పాటించడం ద్వారా డెంగ్యూ వ్యాధి రాకుండా చూసుకోవచ్చున్నారు. డెంగ్యూ లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆర్.బాలాజీ సింగ్, ఎస్.రాజ్యలక్ష్మి, సూర్యనారాయణ, మలేరియా నోడల్ పర్సన్ జేసీహెచ్‌వీకే.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: మండలంలోని పెనుగొల్లు, సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వాసంతి, సిబ్బంది ఎం.రత్నసఖి, ఎస్ఎస్‌వీ.ప్రకాశ్, జయమ్మ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న మేల్కోట జీయర్‌స్వామి



వెంకన్న ఆలయంలో మేల్కోట జీయర్ స్వామి

నక్కపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వెంకన్న క్షేత్రాన్ని శుక్రవారం కర్ణాటక రాష్ట్రం మేల్కోటకు చెందిన శఠగోపముని చిన్న రామానుజ జీయర్ స్వామి దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉత్సవమూర్తుల సన్నిధి, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరుడాద్రిపై వెలసిన స్వామివారి నిజరూపాన్ని దర్శించుకున్నారు. స్థానిక శ్రీవైష్ణవి గోష్టి సభ్యులతో 15 రోజుల పాటు వేసవిలో ఆధ్యాత్మిక శిక్షణ పొందిన పిల్లలకు జీయర్‌స్వామి జ్ఞాపకలను బహూకరించారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, రాజగోపాలాచార్యులు, సుభాష్, శేషాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు స్వామిని శేషవస్త్రాలు, పూలమాలలతో సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా వేళల మార్పు

ఎస్. రాయవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు 132 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా వేళలు మార్పు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాలో మార్పు ఉంటుందన్నారు. ఉదయం ఐదు నుంచి పది గంటల వరకు, మరలా మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందని చెప్పారు. రెండు మండలాల రైతులు ఈ విషయాన్ని గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

ఏబీజీవీబీ ప్రమాద బీమా పంపిణీ

పాయకరావుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తేరు గ్రామానికి చెందిన కొంకిపూడి నాగేశ్వరరావు కుటుంబానికి ఏబీజీవీబీ ద్వారా మంజూరైన ప్రమాదబీమా రూ.20 లక్షలను శుక్రవారం పంపిణీ చేశారు. మృతుడి భార్య పద్మావతికి బ్యాంకు జిల్లా రీజనల్ మేనేజర్ ఎస్.సతీశ్‌చంద్ర చేతుల మీదుగా ఈ చెక్కును అందించారు. తమ బ్యాంకులో జనరల్ ఇన్సూరెన్స్‌లో నాగేశ్వరరావు రూ.1,000 చెల్లించి ప్రమాదబీమా పాలసీ తీసుకున్నారని, ప్రమాదవశాత్తూ మృతి చెందడంతో ఆయన భార్యకు రూ.20 లక్షలు అందించామని ఈ సందర్భంగా ఆర్ఎం సతీశ్‌చంద్ర తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఏరియా మేనేజర్ జి.సురేశ్‌బాబు, అనకాపల్లి జిల్లా నోడల్ అఫీసర్ ఎం.మోహన్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

పాయకరావుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కల్యాణమస్తు పథకం ద్వారా నిరుపేద ఆర్యవైశ్య కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ పూర్ణిమ పట్టణానికి చెందిన జి.శ్రీనివాసరావు కుటుంబానికి రూ.25 వేల నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ జోన్ ఛైర్మన్ ఆర్.జయప్రకాష్ మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్- 2025 అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ ప్రవేశపెట్టిన శుభమస్తు పథకం ద్వారా ఇప్పటివరకు రెండు నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాల్లోని పిల్లల పెళ్లిళ్ల కోసం ఆర్థిక సాయం అందించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనాదు శ్రీను, జిల్లా వీకేఎస్‌పీ ఇన్‌చార్జి శేఖర్‌బాబు, దాసరి రాజ్‌కుమార్, దాసరి సావిత్రి, వురా వెంకటసత్యనారాయణ, వాసు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న రూరల్ సీఐ రేవతమ్మ

రాష్ట్ర స్థాయి వూషూ టోర్నీలో నర్సీపట్నం క్రీడాకారులకు పతకాలు

నర్సీపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వూషూ టోర్నమెంట్‌లో 13 పతకాలు సాధించిన నర్సీపట్నం క్రీడాకారులను రూరల్ సీఐ రేవతమ్మ శుక్రవారం అభినందించారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు కర్నూలులోని శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపంలో స్టేట్ వూషూ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సీనియర్స్ విభాగంలో డి.అక్షయరాణి, లక్ష్మీపార్వతి, దివాకర్, సబ్ జూనియర్స్ విభాగంలో ఎస్.శ్రీరామ్ నిహాల్, పి.ప్రణీత్ బంగారు పతకాలు సాధించారు. జి.సాయి, యు.రవికుమార్ సిల్వర్ మెడల్స్, టి.జగదీశ్, వై.సాత్విక్, ఎం.దుర్గాప్రసాద్, ఎం.హర్ష, ఎం.సాయిసందీప్, కె.విజయకుమార్ సిల్వర్ మెడల్స్ సాధించారు. క్రీడాకారులను రూరల్ సీఐ రేవతమ్మ, అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు అభినందించారు.

ఎస్సీ నిరుద్యోగులకు ఉచిత నైపుణ్య శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మరిడయ్య

నర్సీపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మరిడయ్య సూచించారు. శుక్రవారం స్థానిక వై జంక్షన్‌లోని రుషి వ్యాలీ భవనంలో సీట్ యాప్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ నిరుద్యోగులకు ఇక్కడ శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణా కేంద్రం పెందుర్తిలో నిర్వహించే వారని, స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో ఇక్కడ కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జేడీఎం కల్యాణి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కోరుబిల్లి మణి, సత్యవతి, బండారు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు



అర్జాపురం బాల వరసిద్ధి వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రావికమతం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.అర్జాపురం బాల వర సిద్ధి వినాయకస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకష్టహర చతుర్థి శుభ పర్వదినం, చైత్ర మాసం, కృష్ణ పక్షం సందర్భంగా శుక్రవారం లోక కల్యాణం కోసం దేశానికి ఉగ్ర అరిష్టాలు తొలగి, శాంతియుతంగా ఉండాలని అర్చకులు గుంటూరు లక్ష్మణ శర్మ, రామారావు గుంటూరు లక్ష్మణరావు పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడగల ఫాల్గుణ, పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయ వార్షికోత్సవం



రామాలయంలో కల్యాణం చేయించుకొంటున్న దంపతులు

చీడికాడ, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండివరం గ్రామంలో కోదండరామస్వామి ఆలయం మొదటి వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థుల ఆర్థిక సాయంతో ప్రముఖ పురోహితులు రాజా విశ్వనాథశర్మ, వడ్లమాని వాసుశర్మ, వై.శ్రీనివాసరావుశర్మ ఆధ్వర్యంలో సాయంత్రం ఐదు గంటలకు విఘ్నేశ్వరపూజతో ప్రారంభమై పలు పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గెంజి స్వాతి, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాలువను కప్పేసిన తుప్పలు



మెరక కాలువలో ఏపుగా పెరిగిపోయిన తుప్పలు

మాకవరపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మెరక కాలువను తప్పలు కప్పేశాయి. కాలువ ఆద్యంతం పిచ్చి మొక్కలు, తుప్పలు పేరుకుపోవడంతో సాగునీరు పారే అవకాశం లేకపోతోంది. దీనికితోడు కాలువను రాలిపోయిన ఆకులు పూర్తిగా కప్పేశాయి. పలితంగా మాకవరపాలెం, తామరం, జి.కోడూరు గ్రామాల్లో ఉన్న సుమారు 300 ఎకరాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి తుప్పలు తొలగించకపోతే సాగునీటికి ఇబ్బందులు తప్పవని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి కాలువల్లో తుప్పలను తొలగించి సాగునీరు సక్రమంగా పారేలా తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పాడి పశువులకు వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ చందక నరసింహులు



పశు వైద్యశాలలను పరిశీలిస్తున్న డీడీ చందక నరసింహులు

కృష్ణాదేవిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని పాడేరు పశుసంవర్ధక ఉప సంచాలకులు డాక్టర్ చందక నరసింహులు స్పష్టం చేశారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పశు వైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి ఓపీ, వైద్యాధికారిని, సిబ్బంది హాజరుపట్టిక, ఇతర రికార్డులను తనిఖీలు చేశారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న పశు వైద్య సేవలపై రైతులను ఆరా తీశారు. పశు వైద్యశాలలో మందులు కొరత ఉన్నట్టు రైతులు తెలిపారు. మందుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీడీ చెప్పారు. అలాగే పశు వైద్యాధికారులు, సిబ్బంది రైతులకు నిత్యం అందుబాటు ఉండాలని, మూగజీవాలకు ఎప్పటికప్పుడు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. రాయితీ విత్తనాలు, ప్రభుత్వ పథకాలపై పాడి రైతులకు అవగాహన కల్పించి, వారికి సక్రమంగా అందేలా చడాలని ఆదేశించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పశు వైద్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆవరణలో మొక్కలు నాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రాంబాబు, పశు వైద్యాధికారి శిరీషా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుపై విచారణ



జి.వెంకటాపురంలో పాఠశాలలో విచారణ చేస్తున్న డిప్యూటీ డీఈవో

మాకవరపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.వెంకటాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడుపై వచ్చిన ప్రజా సమస్యల పరిషాకర ఫిర్యాదుపై శుక్రవారం డిప్యూటీ డీఈవో పి.అప్పారావు విచారణ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న కొందరు ఉపాధ్యాయలు విద్యా వ్యవస్థను భ్రష్టు పటిస్తూ విద్యార్థులకు, ప్రభుత్వాన్ని పలు రీలుల్లో మోసం చేస్తున్నారని, ఒక ఉపాధ్యాయుడు సుమారు రెండేళ్లుగా అనారోగ్యంతో వస్తూ విద్యార్థులకు చదవు చెప్పకుండా జీతం తీసుకుంటున్నారని, దీనిపై ఎంఈవోకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకొవడంలేదని మాకవరపాలెం గ్రామానికి చెందిన పి.ఫ్రానిస్స్ ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా డిప్యూటీ డీఈవో విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఓ స్థానికుడు ఇక్కడ ఉపాధ్యాయులు ప్రవర్తన బాగోపోవడంతో తన ఇద్దరు కుమారులను ప్రైవేటు పాఠశాలలో జాయిన్ చేర్పానని తెలిపారు. అలాగే ఫిర్యాదుదారుడతో పాటు అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను విచారణ చేశారు. ఈ నివేధికను జిల్లా విద్యా శాఖ అధికారికి సమర్పిస్తామని డిప్యూటీ డీఈవో తెలిపారరు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు జాన్ ప్రసాద్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు దరఖాస్తుదారులతో సచివాలయాలు కిటకిట



వడ్డాదిలో నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసేందుకు వచ్చిన అర్జీదారులు

బుచ్చెయ్యపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే ప్రజలతో కిటకిటలాడుతున్నాయి. ఈ నెల 31వ తేదీ వరకు కొత్త రైస్ కార్డుల జారీ, బదిలీలు, మార్పులు, చేర్పులు, సవరణలకు అవకాశం కల్పించడంతో లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గత 15 రోజులుగా వడ్డాది సచివాలయం అర్జీదారులతో కిక్కిరిసిపోతోంది. సిబ్బంది కొరత కారణంగా అప్‌లోడ్ ఆలస్యమవుతున్నది. పది వేలకు పైబడి జనాభా ఉండే వడ్డాదిలోని రెండు సచివాలయాల్లో ఒకే ఒక్క డిజిటల్ అసిస్టెంట్ ఉండడంతో అర్జీదారులు రోజూ గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కొత్తగా పెళ్లయిన వారు, పిల్లల చేర్పునకు భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఈ నెల 31వ తేదీ వరకే గడువు ఉండడంతో అర్జీదారులు ఆందోళన చెందుతున్నారు. రోజూ పది దరఖాస్తులు కూడా అప్‌లోడ్ కావడం లేదని వారు వాపోతున్నారు. రైస్ కార్డు దరఖాస్తు అప్‌లోడ్ కోసం వడ్డాదిలాంటి మేజర్ పంచాయతీలో అదనపు సిబ్బందిని నియమించి సక్రమంగా సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇప్పటికైనా ఈ సమస్యపై అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సర్వర్ పనిచేయక సచివాలయ సేవలకు అంతరాయం



సర్వర్ పని చేయ్యక లైన్‌లో నిరీక్షిస్తున్న ప్రజలు

దేవరాపల్లి: సచివాలయాల్లో సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో ఆన్‌లైన్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వివిధ అవసరాల నిమిత్తం సచివాలయాలకు వస్తున్న ప్రజల సమయం వృథా అవుతోంది. తమ పనికోసం గంటల తరబడి వేచి ఉండలేని ప్రజలు సచివాలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు. సాంకేతిక పరమైన సమస్య వల్ల లేదా ఇతరత్ర కారణాలతో అంతరాయం జరుగుతుందా? అని దానిపై సరైన సమాధానం అధికారుల నుంచి రావడంలేదు. సచివాలయ పని వేళల్లో సర్వర్లు మొరాయిస్తున్నాయి. ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలోనే సర్వర్లు పనిచేయడం లేదు. సచివాలయ వేళలు ముగిసిన తరువాత కొంత సేపు పనిచేస్తున్నప్పటికీ ప్రయోజం లేకపోతోంది. అప్పటికే సిబ్బంది పని వేళలు ముగిసిపోవడంతో వెళ్లిపోతున్నారు. ఆన్‌లైన్ అయినా ఈకెవైసీ కావడం లేదని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు.

అన్నదాత సుఖీభవ జాబితాల పరిశీలన

రేలుగుంట, మే 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చిన రైతుల జాబితాలను అన్ని రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో పరిశీలన చేపడుతున్నట్టు వ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 20లోగా వెబ్‌ల్యాండ్‌లో రైతుల వివరాలను పరిశీలించి ఆమోదించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. వెబ్‌ల్యాండ్‌లో పేరు, ఆధార్‌లో పేరు ఒకేలా ఉన్న వారి వివరాలను ఆమోదిస్తున్నామని, లేనిపక్షంలో వీఆర్వో లాగిన్‌లో సరిచేసుకోవాలని ఆమె తెలిపారు.

22 నుంచి తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

కశింకోట, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెదగుమ్మం వీధిలో ఉన్న గవరపేట శారదా గణపతి రామాలయంలో 4వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ఈ నెల 22 నుంచి 25వచ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన కరపత్రాలను అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళాపరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట దేవినాయుడు, సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఇప్పటికే ఎంట్రీలు పూర్తయిన ఈ పోటీలకు మొత్తం 10 నాటికలను ఎంపిక చేశారు. 22వ తేదీ రాత్రి తొమ్మిది గంటలకు విశాఖపట్నం తెలుగు కళాసమితి వారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటిక, రాత్రి 10.15 గంటలకు కాకినాడ బి.వి.కె. క్రియేషన్స్ వారి 'తితిక్ష' నాటిక, 23వ తేదీ రాత్రి 8.45 గంటలకు కరీంనగర్ చైతన్య కళాభారతి వారి 'చీకటి పువ్వు' నాటిక, రాత్రి 10 గంటలకు గుంటూరు అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక, రాత్రి 11.15 గంటలకు విజయవాడ గురజాడ కళామందిర్ వారి 'మహాప్రస్థానం' నాటిక, 24వ తేదీ రాత్రి 8.45 గంటలకు హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ వారి 'మూల్యం' నాటిక, రాత్రి 10 గంటలకు గుంటూరు జిల్లా కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ వారి 'జనరల్ బోగీలు' నాటిక, రాత్రి 11.15 గంటలకు పెందుర్తి నటరాజ డ్రమెటిక్ అసోసియేషన్ వారి 'శిథిల జీవి' నాటిక, 25వ తేదీ రాత్రి తొమ్మిది గంటలకు గుడివాడ కృష్ణా అండ్ కల్చరల్ అసోసియేషన్ వారి 'ద్వారబంధాల చంద్రయ్యనాయుడు' నాటిక, రాత్రి 10 గంటలకు విశాఖపట్నం జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ వారి 'అనగనగా ఒక రాజు' నాటికను ప్రదర్శిస్తారు.

మద్యం సీసాలతో పట్టుబడిన వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి నుంచి శుక్రవారం మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. తుమ్మపాలకు చెందిన గుటాల రమణ అనే వ్యక్తి మద్యం షాపులో 11 మద్యం క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి వెళుతున్నాడు. ఇంతలో షుగర్ ఫ్యాక్టరీ వద్ద అనుమానం వచ్చి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తనిఖీ చేయగా అతని వద్ద పదకొండు మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. వెంటనే వాటిని స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

అదృశ్యమైన చిన్నారి కోసం పోలీసుల గాలింపు

అనకాపల్లి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మళ్ల వీధి సమీపం లోకావారి వీధికి చెందిన భీశెట్టి రోహిత అనే బాలిక అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు ముమ్మరంగా గాలింపు చరల్యలు చేపడుతున్నారు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రోహిత అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు వారు చిన్నారి కోసం విస్తృతంగా గాలింపు జరుపుతున్నారు. చిన్నారి పెరుగుబజార్ రోడ్డు మీదుగా వెళ్లినట్లు సామాజిక మాధ్యమాల ద్వారా తెలిసింది. శుక్రవారం ఉదయం నుంచి కానిస్టేబుళ్లు, ఆ శాఖ ఉన్నతాధికారుల ఆమె కోసం గాలిస్తున్నారు. రాత్రి సమయంలో చిన్నారి విశాఖ నగర పరిధిలో ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందినట్టు తెలిసింది. ఈ మేరకు ఇక్కడి పోలీసులు సిబ్బంది అక్కడికి వెళ్లినట్టు ప్రచారంలో ఉంది.

పాము కాటుతో ఐదు మేకల మృతి

రావికమతం, మే 16 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురై ఐదు మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని కేబీపీ అగ్రహారంలో శుక్రవారం జరిగింది. చందనాల చిన భీముడు మేకలను గ్రామ శివారు జీడిమామిడి తోటలలోకి మేతకు తోలుకుని వెళ్లాడు. మధ్యాహ్నం కొత్తచెరువులో నీరు తాగడం కోసం మేకలు దిగి తిరిగి జీడితోటల్లోకి వస్తున్న క్రమంలో పాము కాటు వేసింది. దీంతో ఐదు మేకలు అక్కడికక్కడే ఒకేసారి మృతి చెందాయని బాధితుడు చిన భీముడు వాపోయాడు. రావికమతం పశు వైద్యులు వచ్చి మేకలను పరిశీలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

అవగాహనతోనే డెంగ్యూ నివారణ



డెంగ్యూ వ్యాధిపై నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

మాకవరపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చునని నిమాకవరపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంచితే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశార్నరు.

నాతవరంలో...

నాతవరం: మండల కేంద్రం నాతవరంలో శుక్రవారం డెంగ్యూపై వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజేశ్‌నాయుడు మాట్లాడుతూ డెంగ్యూ నివారణ కోసం పరిశీలించాలి, శుభ్రం చెయ్యాలి, మూతలు పెట్టాలి అన్న విషయాలు తెలుసుకోవాలన్నారు. ఇంటి ముందర నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు అలాగే డెంగ్యూ రాకుండా దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న వైద్య సిబ్బంది బైరాగి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: ఓడించండి పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజా ఆరోగ్యం అంటూ దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలను తరిమి కొట్టాలని, నీటిపై మూతలు పెట్టాలని అంటూ నినాదాలు చేశారు. వైద్యాధికారి వనజ, పర్యవేక్షకులు పుష్పరాజు సిబ్బంది పాల్గొన్నారు.

కూలి చెల్లించకపోతే మట్టి తిని బతకాలా..



మట్టి తింటూ వినూత్న రీతిలో ఆందోళన చేస్తున్న కూలీలు

చీడికాడ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం కూలీలకు ఎనిమిది వారాలుగా బకాయిలు చెల్లించకుంటే మట్టి తిని బతకాలా అంటూ శుక్రవారం అర్జునగిరి పనిప్రదేశంలో ఆందోళన చేశారు. బిల్లులు చెల్లించేవరకూ దశలవారీగా అందోళన చేస్తామని స్పష్టంచేశారు. వీరికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న పాల్గొని మాట్లాడారు. మార్చి 20 నుంచి కూలీలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేట్లు, అధిక సంఖ్యలో వేతనదారులు పాల్గొన్నారు.

ఉష్ణోగత్రల తగ్గింపు దిశగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

ఎంపీడీవో పీవీఎస్‌జే ఆంజనేయులు

చోడవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా శనివారం బహిరంగ ప్రదేశాల వద్ద వేడిని తగ్గించే కార్యక్రమాలు అమలుచేయాలని ఎంపీడీవో పీఎస్‌జే.ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం ఉష్ణోగ్రతల తగ్గింపు కార్యక్రమాల కింద ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్లపైనా తెల్లని పెయింట్ వేశారు. పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో వర్షపు నీటిని సేకరించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. భవనాల వేడిని తగ్గించడానికి ఇళ్లపై కప్పులలో తోటల పెంపకం ప్రోత్సహించాలని కోరారు. రహదారుల వెంట పాఠశాలలు, బహిరంగ ప్రదేశాలలో నీడనిచ్చే చెట్ల పెంచాలని, సీనియర్ సిటిజన్లు, పిల్లలు, కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంతో పాటు వడగాల్పులపై అవగాహన కల్పించాలన్నారు. పశు పక్ష్యాదులకు తాగు నీటిని అందించే కార్యక్రమాలు, నీడ ఇచ్చే విధంగా షెడ్లు, తాగునీటి తొట్టెల ఏర్పాటుకు చొరవ చూపించే కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

బుచ్చెయ్యపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది కస్బా ఆయకట్టులో రెండో పంట ధాన్యాన్ని రైతులు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో మొదటి పంట ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారని గుర్తుచేశారు. ఈ రబీ సీజన్‌లో పండిన వరిపంటను అధికారులు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, ఇప్పటికే పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రస్తుతం వరి పంట పూర్తిగా పండి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, కూటమి నాయకులు, అధికారులు స్పందించి రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మణికంఠ మృతి



మణికంఠ (ఫైల్)

రావికమతం, మే 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైన కన్నంపేట గ్రామానికి చెందిన సియాద్రి మణికంఠ (15) మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం మృతి చెందాడు. కన్నంపేట గ్రామానికి చెందిన సింహాద్రినాని, అమ్మాజీ కూలి చేస్తూ తన కుమారుడు మణికంఠను చదివిస్తున్నారు. తల్లిదండ్రుల కష్టం చూస్తున్న మణికంఠ చదువులో బాగానే రాణిస్తున్నాడు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. దీంతో ఎంతగానో పొంగిపోయిన తల్లిదండ్రుల ఆనందం ఎంతో కాలం నిలవలేదు. 15 రోజుల క్రితం మణికంఠకు ఊపిరితిత్తుల్లో సమస్య ఏర్పడి ప్లేట్‌లెట్లు తగ్గడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ పరిస్థితి మరింత విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికు తరలిం చారు. వైద్య ఖర్చు అధిక మొత్తంలో అవుతుండంతో పలువురు దాతలు ముందుకు వచ్చి మణికంఠ ఆరోగ్యం మెరుగుపడాలని సహాయం అందించారు. చదువులతో పోరాడి విజయం సాధించిన మణికంఠ, మృత్యువుతో పోరాడలేకపోయాడు. దీంతో కన్నంపేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

కొవ్వూరులో గడ్డి వాము దగ్ధం

రోలుగుంట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వూరులో బంటు రాజుకు చెందిన గడ్డి వాము శుక్రవారం దగ్ధమైంది. కొంత మంది టాపాసులను వెలిగించడంతో నిప్పురవ్వలు గడ్డి వాముపై పడడంతో మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. రైతు రాజు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో మూడు ఎకరాల గడ్డి వాము దగ్ధమైందని రైతు తెలిపారు.

అటవీ సంపద కొల్లగొట్టడానికే ఆపరేషన్ కగార్

- **సీపీఐ నాయకులు రామునాయుడు, సత్యనారాయణ**

కృష్ణాదేవిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజన ప్రజల కుటుంబాల మరణకాండన చేయవద్దని అనకాపల్లి, అల్లూరి జిల్లాల కార్యదర్శులు మాకిరెడ్డి రామునాయుడు, పొట్టిక సత్యనారాయణ, గొలుగొండ మండల కార్యదర్శి జి.రాధాకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను నిర్మూలించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. మానవ జీవంపై జాలీ, దయ లేకుండా ఇప్పటి వరకు 435 మందిని బీజేపీ ప్రభుత్వం పొట్టను పెట్టుకుందన్నారు. గిరిజన ప్రాంతంలో అటవీ సంపదను కొల్లగొట్టుకోవడానికి అమాయక గిరిజనలు, మావోయిస్టులు ప్రశ్నించకుండా అడ్డు తొలగించాలని దుర్మార్గమైన ఆలోచనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఆలోచనలు మార్పు చేసుకుని ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా వారితో చర్యలు జరపాలని, మరణ కాండను ఆపాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకోవాలని వారు కోరారు.

దోమకారక వ్యాధులతో బహుపరాక్



చింతపల్లిలో ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, వైద్యులు



పెదవలసలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ



సీలేరులో నినదిస్తున్న వైద్య సిబ్బంది

చింతపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ లావణ్య అన్నారు. చింతపల్లిలో ఆర్‌వీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, వైద్య సిబ్బంది డెంగ్యూపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్య మాట్లాడుతూ దోమకాటు వల్ల డెంగ్యూ జ్వరం వస్తుందన్నారు. ప్రజలు జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వచ్చి రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు. జ్వరాలపై అశ్రద్ధ చేయరాదన్నారు. గృహాలకు దోమల మందు పిచికారీ చేయించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. గృహాల్లో నిలువనీరు లేకుండగా చూసుకోవాలన్నారు. నిద్రించే సమయంలో దోమతెరలను వాడాలన్నారు. ఆర్‌వీనగర్ వైద్యాధికారులు సౌమ్య, రాజారవీంద్ర, శ్రావణి, హెచ్‌వీ శాంతమణి, హెచ్‌ఏ సత్యారావు, ఏఎన్‌ఎం కుమారి, ఎల్‌టీ అనీల్ పాల్గొన్నారు.

సీలేరు: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జీకేవీధి మండలం సీలేరులో స్థానిక వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్లకార్డులు చేతబూని డెంగ్యూ నివారణకు పాటించవలసిన జాగ్రత్తలపై నినదించారు. సీలేరు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎస్‌కె మస్తాన్‌వలీ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి సోకకుండా ఉండాలంటే మన ఇంటి చుట్టూ, లోపల గుంతల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నిల్వనీటిలో దోమ లార్వాను ఉత్పత్తి చేస్తుందని, లార్వా వృద్ధి చెందకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా నీటి నిల్వలు లేకుండా శుభ్రపర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కె.సౌమ్య, హెల్త్ సూపర్‌వైజర్ ఎన్.త్రినాథ్, ఏఎన్‌ఎంలు ఎం.అరుణ, కుమారీ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: దోమల వల్ల సంక్రమించే వ్యాధులపై ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలని పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కోమలి అన్నారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకుని పెదవలసలో పీహెచ్‌సీ వైద్యులు, అరసాడలో జీకేవీధి పీహెచ్‌సీ వైద్యులు, వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారపు సంతలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కోమలి మాట్లాడుతూ ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమతెరలు వినియోగించడం, గృహపరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దోమల నివారణమందు పిచికారీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పృధ్వీష, వినయ్‌కుమార్, సబ్ యూనిట్ అధికారి కన్నబాబు, ఎంపీహెచ్‌ఎస్ శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ రమాదేవి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: డుంబ్రిగుడలో డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ ఈ వ్యాధి ప్రమాదకరమన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచి, నీటి నిల్వలు లేకుండా ఉంటే డెంగ్యూ దరిచేరదన్నారు. నివాస గృహాల సముదాయంలో టైర్లు, పాత వస్తువులు, నీళ్ల ట్యాంకులు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అందరి భాగస్వామ్యంతోనే డెంగ్యూ నివారణ సాధ్యపడుతుందన్నారు. వైద్యాధికారిణి అంబిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన జిల్లా కమిటీ నూతన కార్యవర్గం

పాడేరురూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎంపిక చేసినట్లు కమిటీ రాష్ట్ర నాయకులు తెలిపారు. కమిటీ జిల్లా చైర్మన్‌గా కుడుముల కాంతారావు, జిల్లా కన్వీనర్‌గా సాగిన ధర్మానపడాల్, కో-కన్వీనర్‌లుగా కూడా రాధాకృష్ణ, వి.నాగేశ్వరరావు, జి.భాను, పి.బాలదేవ్, కె.కొత్తయ్య, సీహెచ్.మోహన్, పి.లక్కు, కె.కాంతారావు, టి.రాము, కె.మనోజ్‌కుమార్, ఎం.రమేష్, టి.శోభన్, పి.అశోక్, ఎన్.జాన్‌బాబు, టి.కృష్ణారావు, వి.దాస్‌లను ఎన్నుకున్నామన్నారు. మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా కాంగు సుభశర్మ, కన్వీనర్‌గా కావడం కాసులమ్మ, కో-కన్వీనర్లుగా ఎస్.హైమావతి, ఊర్వశి, కృష్ణకుమారి, సింహాచలం, విమల, రత్నాబాయ్, రాధ వ్యవహరిస్తారన్నారు. డీఎస్సీ అభ్యర్థుల కమిటీ కన్వీనర్‌గా రబ్బా ప్రశాంత్‌కుమార్, కో-కన్వీనర్లుగా వి.జోసెఫ్, బి.రాజారావు, వెంకటజగన్, జె.చలపతి, ఆర్.నాగభూషణ్, ఎం.నారాయణరాజు, ఎం.చిరంజీవి, కె.చందు, వి.సత్తిబాబు, విద్యార్థి విభాగం కన్వీనర్‌గా కె.రాజశేఖర్, కో-కన్వీనర్‌గా పి.కార్తీక్, మేధావుల ఫోరం చైర్మన్‌గా వల్ల వెంకటరమణ, కన్వీనర్‌గా రావుల జగన్మోహన్‌రావు, కో-కన్వీనర్లుగా పి.ప్రసాద్, వి.కొండబాబు, కె.ఆనంద్, పి.దేవుళ్ళనాయుడు, జి.ధనుంజయ్, పి.దేముడు, సీహెచ్.నాగేశ్వరరావు, వి.లచ్చిరెడ్డి, వి.బాలకృష్ణ, ఎల్.రాంబాబులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. సలహాదారులుగా ఎస్.మాణిక్యం, కె.సురేంద్ర, పి.అప్పలనర్స, కె.రాజన్, కె.జోసెఫ్, టి.రామారావు, బాలకృష్ణ, కె.సుబ్రమణ్యం వ్యవహరిస్తారని వివరించారు.

ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ నెల 21 వరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా ఎనిమిది మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

చింతపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి టి.మల్లేశ్ అన్నారు. లంబసింగి పంచాయతీ నూతిబంద గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు పది, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరియర్ గైడెన్సు కార్యక్రమం నిర్వహించారు. ఏకోర్సు అభ్యసిస్తే ఎటువంటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయనే విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. బాలికలు విద్యాభ్యాసం పూర్తికాకుండగా, 18 ఏళ్లు నిండకుండా వివాహం చేసుకోరాదన్నారు. తిరుపతి బాబు, దావీదు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ టీడీపీ ఇన్‌చార్జికి వినతులు

పాడేరురూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె నివాస గృహంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బాధితులు వినతులు అందించారు. జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ పరిధిలోని గొడ్డతికర్ర, రోలుగుంట, గుర్రంపనుకు, చింతగుప్ప గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ నాలుగు గ్రామాల ప్రజలు పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం అందించారు. తమ గ్రామాలకు రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయంలో వైద్యసేవలు పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు గ్రామాల ప్రజలు కె.రాజు, కె.చిరంజీవి, సీహెచ్.సిద్ధూ, సీహెచ్.చరణ్, కె.శ్రీను, టి.శ్రీధర్, కె.లింగేశ్వరరావు, సీహెచ్.కోటేశ్వరరావు, కొండలరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. జీకే.వీధి మండలం పెదవలస గ్రామానికి చెందిన దీసరి దీప తన భర్త ఆచూకీ కనుగొనాలని వినతిపత్రం అందించారు. దీప భర్త దీసరి గంగారావు ఉద్యోగ రీత్యా నాతవరం మండలం ఎర్రవరంలో నివాసం ఉంటూ ఏపీఈపీడీసీఎల్‌లో విద్యుత్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారన్నారు. విధి నిర్వహణలో భాగంగా 5 నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని దీప ఆందోళన వ్యక్తం చేసింది. అర్చకులకు ప్రభుత్వం ప్రకటించిన గౌరవ వేతనాలు ఇప్పించాలని కోరుతూ అల్లూరి జిల్లా అర్చకులు వినతిపత్రం అందించారు. ఆలయాల్లో దూపదీప నైవేద్యంలో భాగంగా ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం అందించేందుకు కృషి చేయాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి కొట్టగుళ్లి రమేష్‌నాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, కొయ్యూరు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి

కాఫీ సాగులో సస్యరక్షణ కీలకం

శాస్త్రవేత్త సునీల్ బాబు

చింతపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): కాఫీ సాగులో సస్యరక్షణ కీలకమని ఆర్‌వీనగర్ కేంద్ర ప్రాంతీయ కాఫీ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సునీల్ బాబు అన్నారు. శుక్రవారం క్లైమేట్ స్మార్ట్ అగ్రికల్చర్ ప్రాజెక్టులో భాగంగా విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టు కేంద్ర ప్రాంతీయ కాఫీ పరిశోధన స్థానంలో రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ గిరిజన రైతులు కాఫీలో మేలైన అధిక దిగుబడులు పొందేందుకు వేసవిలో పలు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా మొక్కల్లో డెక్క కొమ్మలు, ఎండు కొమ్మలను తొలగించుకోవాలన్నారు. కాఫీ తోటలకు అవసరమైన నీడను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రధానంగా కాండం తొలుచు పురుగు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాఫీ రైతులు మొక్కల ప్రధాన కాండంలో కొబ్బరి పీచుతో నునుపుగా చేసుకోవాలన్నారు. కాండం తొలుచు పురుగు ఆశించిన మొక్కలను గుర్తించి తొలగించి కాల్చివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సాంకేతిక నిపుణులు డాక్టర్ అప్పలరాజు, గిరిజన రైతులు పాల్గొన్నారు.



రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

క్రీడా సామగ్రి పంపిణీ

పెదబయలు, మే 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువత క్రీడల్లో రాణించాలని పెదబయలు మండలం వనభంగికి చెందిన పోరాపు రంజిత్‌కుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం గ్రామంలో యువతకు క్రికెట్, వాలీబాల్ పరికరాలను గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. చదువుతోపాటు క్రీడా రంగంలో కూడా ముందుండాలన్నారు. క్రీడలు ఆరోగ్యం, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. అందుకే తన నుండి ఈ చిరు కానుకగా యువతకు క్రీడా సామాగ్రిని అందిస్తున్నట్లు తెలిపారు. క్రీడా సామాగ్రిని అందిచిన రంజిత్‌ను గ్రామస్తులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మోహనరావు, విష్ణుమూర్తి, కేశవరావు, కొండలరావు, మహేష్, వీరేష్, కోమటి, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యా బోధన తీరుపై అసంతృప్తి



ముంచంగిపుట్టు మండల సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

ముంచంగిపుట్టు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు విద్య అందే విధంగా అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని ముంచంగిపుట్టు మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షురాలు శెట్టి నీలవేణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల యుద్ధంలో అమరులైన జవాన్లకు తొలుత నివాళులర్పించారు. అనంతరం పలు సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. విద్యా వ్యవస్థ దారుణంగా ఉందని అధికారులపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక స్థాయిలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంటే పిల్లలు ఉన్నత శిఖరాలకు ఎలా వెళతారని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు ప్రశ్నించారు. ఈ ఏడాది నుంచి అయినా ప్రాథమిక విద్యపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని ఎంఈవో బాలాజీ కోరారు. ఎస్‌ఎంఐ పనితీరు బాగులేదని, ఎక్కడ ఏ పని మంజూరైనా ప్రజాప్రతినిధులకు తెలియజేయడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, ఐసీడీఎస్, జీసీసీ, హౌసింగ్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ తదితర శాఖల సమస్యలపై వాడివేడి చర్చ జరిగింది. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ గిరిజనేతర ప్రాంతంలో ప్రభుత్వ భూములను గుర్తించి అధికారులు స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఈ విషయం కలెక్టర్‌తో చర్చిస్తున్నట్లు తెలిపారు. పర్యాటక శాఖ ఆధీనంలో ఉన్న కేంద్రాల వద్ద స్థానికుల నుంచి రుసుము తీసుకోవద్దని కోరారు. సచివాలయాల సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిచడంలేదని, వారి తీరు మార్చుకోవాలని సూచించారు. వ్యాధుల కాలం ప్రారంభం కావడంతో దోమల నివారణ మందు పిచికారీ చేయాలని, పొగ కొట్టాలని అన్నారు. అన్నదాత సుఖీభవలో అనేక మంది పేర్లు జాబితాలో లేవని, వాటిని సరి చేయాలని మండల వ్యవసాయ అధికారికి సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత చిత్రకొండ జట్టు

సీలేరు, మే 16 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో నిర్వహించిన మారెమ్మతల్లి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఒడిశాకు చెందిన చిత్రకొండ జట్టు ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. సీలేరు జట్టు (చిన్ని లెవన్స్ టీం) రన్నరప్ ట్రోఫీ లభించింది. సీలేరు మారెమ్మ అమ్మవారి 53వ వార్షిక మహోత్సవాల సందర్భంగా గత నెల 20 నుంచి స్థానిక యూత్ ఆధ్వర్యంలో డీఏవీ పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. జీకేవీధి, వై.రామవరం మండలాలతో పాటు సరిహద్దులోని ఒడిశా క్రీడాకారులే మొత్తంగా 24 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. అలాగే జూనియర్ విభాగంలోనూ, 40 సంవత్సరాలు పైబడిన సీనియర్ లెజెండర్స్ విభాగంలోనూ వేరువేరుగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. యూత్‌కు నిర్వహించిన పోటీల్లో సీలేరు, చిత్రకొండ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. శుక్రవారం సీలేరు-చిత్రకొండ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చిత్రకొండ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా, మొదట బ్యాటింగ్ చేసిన సీలేరు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 74 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్రకొండ జట్టు 8.2 ఓవర్లలోనే 75 పరుగులు సాధించి టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది. చిత్రకొండ జట్టుకు రూ.20 వేల నగదు, ట్రోఫీని అందజేశారు. రన్నరప్‌గా నిల్చిన సీలేరు జట్టుకు రూ.10 వేల నగదు, ట్రోఫీని అందజేశారు. టోర్నమెంట్‌లో ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా సీలేరుకు చెందిన జాన్, బెస్టు బౌలర్‌గా సుదర్శన్, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌గా సీలేరుకు చెందిన శశికుమార్‌లు ఎంపికయ్యారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో జెన్‌కో అధికారులు, ఈఈలు శ్రీనివాసరెడ్డి, జి.భాస్కరరావు, ఏడీఈ దుర్గాక్ష నివాస్, ఏఈ సురేష్, ఏవో ఈవీవీ సత్యనారాయణ, సర్పంచ్ పి.దుర్గో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, మారెమ్మ ఆలయ కమిటీ సభ్యులు వానపల్లి అప్పారావు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, సీలేరు యూత్ సుందరరావు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



మారెమ్మతల్లి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ విజేత చిత్రకొండ జట్టుకు ట్రోఫీ, నగదు అందజేస్తున్న జెన్‌కో ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి

ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ సతీశ్ కుమార్ హఠాన్మరణం



చింతపల్లి/రావికమతం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబసింగి గ్రామ పంచాయతీకి చెందిన కొత్తకోట స్టేట్‌బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ వాలంగి సతీశ్ కుమార్(46) హఠాన్మరణం పొందారు. ఈయన స్థానిక వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కంటా జాహ్నవి భర్త. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సతీశ్‌కుమార్ కుటుంబంతో నర్సీపట్నం శారదానగర్‌లో నివాసముంటున్నారు. గురువారం ఉద్యోగరీత్యా సతీశ్ కుమార్ భార్య జాహ్నవి చింతపల్లి వచ్చి విధులు ముగించుకుని ఆమె స్వగ్రామం చౌడుపల్లిలో బస చేశారు. కాగా నర్సీపట్నంలోనున్న సతీశ్‌కుమార్ శుక్రవారం ఉదయం నిద్రలేచి బ్యాంక్‌కి వెళ్లేందుకు ఏడు గంటలకు సిద్ధపడ్డాడు. అల్పాహారం తీసుకు రావాలని అపార్టుమెంట్ వాచ్‌మన్‌కి పంపించారు. వాచ్‌మన్ అల్పాహారం తీసుకుని తిరిగి వచ్చేసరికి ఆయన నేలపై పడి వున్నాడు. దీంతో స్థానికులు ఆస్పత్రికి తీసుకు వెళ్లే ప్రయత్నం చేయగా.. అప్పటికే ఆయన మృతి చెందారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు లంబసింగి తీసుకొచ్చారు. శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా మృతుడు సతీశ్‌కుమార్ రిటైర్డు ఏటీడబ్ల్యూవో వాలంగి అప్పలనర్స కుమారుడు. పిన్నవయస్సులో మృతి చెందడంతో లంబసింగి, చౌడుపల్లిల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. సతీశ్‌కుమార్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌పై న్యాయమూర్తికి ఖైదీ ఫిర్యాదు

ఆరిలోవ (విశాఖపట్నం), మే 16 (ఆంధ్రజ్యోతి): తనపై మానసిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ విశాఖపట్నం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మావోయిస్టు ఖైదీ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ మహేశ్‌బాబుపై జిల్లా కోర్టు న్యాయమూర్తికి ఫిర్యాదు చేసినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కేసు వాయిదా నిమిత్తం న్యాయమూర్తి ముందు గత సోమవారం ఖైదీని హాజరు పరచగా, ఆ సమయంలో న్యాయమూర్తికి జైలు సూపరింటెండెంట్‌పై ఫిర్యాదు చేసినట్టు సీఐ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన మావోయిస్టు సానుభూతిపరుడు నాగన్న కేంద్ర కారాగారంలో ఖైదీగా ఉన్నాడు. అతడిని ఈ నెల 5న వాయిదా నిమిత్తం జిల్లా న్యాయమూర్తి ముందు పోలీసులు హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో నాగన్న ఫిర్యాదు చేస్తూ.. జైలులో తనను సూపరింటెండెంట్ మహేశ్‌బాబు మానసికంగా వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేశాడు. అనేక విధాలుగా తనను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. దీనిపై విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఆరిలోవ పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్ర కారాగారంలో విచారణ చేపట్టినట్టు సీఐ తెలిపారు. జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రస్తావించగా, నాగన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అతడు మావోయిస్టు సానుభూతిపరుడని, అతడిపై సుమారు 10 కేసులు ఉన్నాయన్నారు. ఆయుధాలు, హత్య వంటి తీవ్ర కేసులు ఉన్నాయన్నారు. ఈ నెల 4న నాగన్న ఉన్న బ్యారక్‌లోకి జైలు అధికారులతో వెళ్లి పరిశీలిస్తుండగా.. అతడి వద్ద బ్లేడ్లు, రేజర్లు గుర్తించామన్నారు. ఇవి ఎందుకు ఉన్నాయని ఆరా తీశామన్నారు. కేంద్రకారాగారంలో సుమారు 32 మంది మావోయిస్టు సానుభూతిపరులు ఉన్నారని జైలు సూపరింటెండెంట్ తెలిపారు. వీరిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నట్లు చెప్పారు.

గిరిజన సంక్షేమ శాఖ డీడీపై ఆరోపణలు తగదు: రేగం

పాడేరు, మే 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజనిపై దండ కారణ్య విమోచన సమితి అకారణంగా ఆరోపణలు చేయడం తగదని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ అన్నారు. పలువురు అధికారుల తీరుపై ఇటీవల దండకారణ్య విమోచన సమితి ముద్రించిన కరపత్రంపై శుక్రవారం గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం నిర్వహించిన సమావేశంలో చర్చించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ... రజని పూర్తిఅదనపు బాధ్యతలు చేపట్టిన తర్వాత గిరిజన విద్యాభివృద్ధికి మేలు జరిగిందన్నారు. అధికారులపై నిరాధార ఆరోపణలు చేయడం తగదనిఅభిప్రాయపడ్డారు. టీడబ్ల్యూ టీచర్ల సంఘం నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులకు ఉపాధ్యాయులు డుమ్మా

సీలేరు, మే 16 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి తప్పిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఉపాధ్యాయులు హాజరు కావడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 20న నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షల కోసం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. సీలేరు పరీక్షా కేంద్రంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 33 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందులో ఆరుగురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. మిగతా 27 మంది పరీక్ష తప్పారు. జిల్లాలోని పలు పాఠశాలలతోపాటు, సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. శిక్షణతరగతులకు అవసరమైన కాలపట్టిక (టైం టేబుల్)ను కూడా జారీ చేసినప్పటికీ సీలేరు జిల్లా పరిషత్ పాఠశాలలో వీటిని బేఖాతరు చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలోనూ అన్ని గదులకు తాళాలు వేసి ఉన్నాయి. విద్యార్థులు వచ్చి వెళ్లిపోయారు. ఉపాధ్యాయుల తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు వేసిన తాళం

'డిమాండ్లు పరిష్కరించేవరకు పోరాటం'



ఐటీడీఏ వద్ద దీక్షల్లో పాల్గొన్న నాయకులు

పాడేరురూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు ప్రాంతంలో ఉద్యోగాల నియామక చట్టం చేయాలని, ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పెదబయలు మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు. జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర మాట్లాడుతూ గిరిజన సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు శాంతియుతమైన ధర్మ పోరాటం కొనసాగిస్తామన్నారు. 3వ రోజు నిరాహార దీక్ష శిబిరంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సింహాచలం, ఏపీటీడబ్ల్యూటీఏ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పలాసి కృష్ణారావు, పెదబయలు అధ్యక్షుడు కూడా బాలకృష్ణ, నాయకులు పలాసి తిరుపతిరావు, మాలంనాయుడు, సంజీవరావు, పూర్ణచంద్రనాయుడు, భాస్కరరావు, ఎం.ఈశ్వరరావు, ఎల్.శివ, జి.సతీష్‌కుమార్, తెల్లబాబు, నాగరాజు, సోంబాబు, రాంబాబు, మూర్తి, బి.మాధవరావు, కె.రవి, పి.చిన్నమూర్తి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

గూడెంకొత్తవీధి, మే 16 (ఆంధ్రజ్యోతి): సంకాడ పంచాయతీ గోవాడలో ఓ దుక్కిటెద్దు విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామంలో గుంట బిస్సంకి చెందిన దుక్కిటెద్దు పశువుల మందతో కలిసి మేతకు వెళ్లింది. సాయంత్రం తిరిగి వస్తుండగా గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తు వైర్లకు తాకి విద్యుదాఘాతంతో మృతి చెందిందని బాధిత పెంపకందారుడు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

బస్ షెల్టర్ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

చింతపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): అంతర్ల గ్రామంలో బస్ షెల్టర్ స్థలం ఆక్రమణకు గురికావడంతో స్థానిక యువత తహసీల్దార్ టి.రామకృష్ణకు ఫిర్యాదు చేసింది. జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా గ్రామంలో పాత బస్ షెల్టర్‌ను తొలగించారు. ప్రస్తుతం ఈ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నాడు. దీంతో స్థానిక యువత అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని యువకులు రెవెన్యూ, పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అర్హులందరికీ పక్కా గృహాలు: ఎంపీడీవో

గూడెంకొత్తవీధి, మే 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో అర్హులందరికీ ప్రభుత్వం పక్కా గృహాలు మంజూరు చేస్తుందని స్థానిక ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు అన్నారు. పందిరాయి కొత్తగూడెం గ్రామంలో శుక్రవారం హౌసింగ్ అధికారులు పీఎం జన్‌మన్ పక్కా గృహాల గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. గ్రామంలో 45మంది ఆదిమజాతి ఆదివాసీలతో పక్కా గృహాల నిర్మాణాలకు భూమిపూజ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గిరిజనుల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం అధిక సంఖ్యలో పక్కా గృహాలు మంజూరు చేస్తుందన్నారు. లబ్ధిదారులకు సకాలంలో గృహనిర్మాణ శాఖ బిల్లులు చెల్లిస్తుందన్నారు. గిరిజనులు పక్కా గృహాలను సద్వినియోగం చేసుకుంటూ, సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, కూటమి నాయకులు ముక్కలి రమేశ్, సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, హౌసింగ్ ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.



గృహ నిర్మాణానికి పునాదులు తీసుకున్న గిరిజనులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

సబ్బవరాన్ని వీడని పీడలా మురుగు

▸▸ దశాబ్ద కాలంగా వెంటాడుతున్న సమస్య ▸▸ పలుచోట్ల వాడుక, వర్షపు నీరు పారే మార్గం లేక తిష్ట ▸▸ ఆర్‌అండ్‌బీ స్థలాల ఆక్రమణతో మరింత జటిలం ▸▸ అవస్థలు పడుతున్న జనం

సబ్బవరం, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరాన్ని మురుగు సమస్య పట్టిపీడిస్తుంది. గత పదేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలాలు పూర్తిగా ఆక్రమణకు గురికావడం వల్ల సమస్య మరింత జటిలంగా మారింది. గతంలో రోడ్డుకు ఇరువైపులా కాలువలు ఉండేవి. మురుగు, వర్షపునీరు పోయేవి. పలువురు ఆక్రమణలకు పాల్పడి షాపులు, దుకాణాలు వంటి వాటివి ఏర్పాటు చేసుకున్నారు. వీటిని కొందరు సొంతంగా నిర్వహిస్తుండగా, మరికొందరు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. షాపులు, టిఫిన్ సెంటర్లు వంటి వాటి నుంచి వచ్చే వాడుక నీరు పోయేందుకు మార్గం లేకపోవడంతో పలువురు రోడ్డుపైకి వది లేస్తున్నారు. ఈ కారణంగా స్థానికులతో పాటు వివిధ పనులపై ఇక్కడికి వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు ఓవైపు దుర్వాసన, మరోవైపు దోమల బెడద భరించ లేకపోతున్నామని పలువురు వాపోతున్నారు.

సాయినగర్ నుంచి వచ్చే వాడుక నీరు, వర్షపు నీరు ప్రవహించేందుకు సరైన మార్గం లేక మూడు రోడ్ల కూడలికి వచ్చి చేరుతుంది. అక్కడి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా వరద నీరు పోయేందుకు సరైన మార్గం లేకపోవడంతో స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలోకి వచ్చి నిలిచిపోతోంది. దీంతో పోలీసు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడెక్కడి నుంచో మురుగు, చెత్తా చెదారం కొట్టుకొచ్చి ఇక్కడ మేటలు వేస్తుండడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు శుభ్రం చేసుకోవడం తమకు ఓ పెద్ద పనిగా మారిందని పోలీసు సిబ్బంది చెపుతున్నారు.



వర్షం కురిస్తే సబ్బవరంలోని మూడు రోడ్ల కూడలిలో దుస్థితి (ఫైల్)

ఇదిలావుంటే, సబ్బవరంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల ఆక్రమణ ఇష్టారాజ్యంగా సాగిందని పలువురు ఆరోపిస్తున్నారు. సదరు ప్రాంతాల్లో దుకాణాల నిర్మాణం జరుగుతున్నట్టు సమాచారం ఉన్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించడం లేదు. ఇందుకు రాజకీయ ఒత్తిళ్లే ప్రధాన కారణమని ప్రచారంలో ఉంది. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ, తగ పదేళ్లలో మరింత అధికమైంది. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి నిర్మాణం మండల కేంద్రం గుండా సాగుతుందని భావించి ఎవరూ ఆర్‌అండ్‌బీ స్థలాల ఆక్రమణల జోలికి వెళ్లలేదు. ఎందుకంటే విస్తరణలో ఆక్రమణలు తొలగిస్తారని భావించేవారు. కానీ ఇరువాడ మీదగా బైపాస్ నిర్మాణం జరుగుతుందని తెలియడంతో ఆక్రమణలు జోరందుకున్నాయి.

ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడి నిర్మాణాలు చేపట్టడంతో వాడుక నీరు, వరద నీరు ప్రవహించే మార్గం లేకపోయింది. దీంతో మురికి కూపంలా సబ్బవరం మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, సబ్బవరాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దే పనిలో ప్రభుత్వం ఉండగా, ఇక్కడ మాత్రం మురుగు సమస్య వీడడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఇక్కడ స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆక్రమణలు తొలగించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుపర్చాలని అంతా కోరుతున్నారు.



పోలీసు స్టేషన్ ఆవరణలో..



అనకాపల్లి రోడ్డులోని సినిమా హాలు వద్ద..

భక్తిశ్రద్ధలతో గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో శుక్రవారం రాత్రి గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రిల వేదమంత్రాల నడుమ కొణతాల రామచంద్రం చంద్రకళ, పవన్‌కుమార్ మేఘన దంపతులు ఊంజల్ సేవను జరిపారు. ఈ సందర్భంగా మహిళా మండలి సభ్యులు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీశ్, ఆళ్ల మహాలక్ష్మినాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల వెంకట సత్యప్రసాద్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీహెచ్‌వోల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న సీహెచ్‌వోలు

అనకాపల్లి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్, పెరుగుబజార్, ఎన్టీఆర్ వైద్యాలయం, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీహెచ్‌వోలు పంథొమ్మిది రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వంలో స్పందించకపోవడం దారుణమన్నారు. సీహెచ్‌వోలను ఆరేళ్లకే పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అందరి ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వోలు దేవి, నూకాలమ్మ, సంధ్య, భవానీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ : ఎమ్మెల్యే బండారు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు, తదితరులు

లంకెలపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో యువత రాణించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పిలుపు నిచ్చారు. లంకెలపాలెంలో మరిడిమాంబ ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర స్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీల విజేతలకు గురువారం రాత్రి ఆయన చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారికి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని పేర్కొంటూ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, బల్ల శ్రీను, టీడీపీ నేత బండారు అప్పలనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

11 మద్యం బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి నుంచి శుక్రవారం మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. తుమ్మపాలకు చెందిన గుటాల రమణ అనే వ్యక్తి మద్యం షాపులో 11 మద్యం క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి వెళుతున్నాడు. ఇంతలో షుగర్ ఫ్యాక్టరీ వద్ద అనుమానం వచ్చి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తనిఖీ చేయగా అతని వద్ద పదకొండు మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. వెంటనే వాటిని స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

అదృశ్యమైన చిన్నారి కోసం పోలీసుల గాలింపు

అనకాపల్లి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మళ్ల వీధి సమీపం లోకా వారి వీధికి చెందిన భీశెట్టి రోహిత అనే బాలిక అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రోహిత అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు వారు చిన్నారి కోసం విస్తృతంగా గాలింపు జరుపుతున్నారు. చిన్నారి పెరుగుబజార్ రోడ్డు మీదుగా వెళ్లినట్లు సామాజిక మాధ్యమాల ద్వారా తెలిసింది. శుక్రవారం ఉదయం నుంచి కానిస్టేబుళ్లు, ఆ శాఖ ఉన్నతాధికారుల ఆమె కోసం గాలిస్తున్నారు. రాత్రి సమయంలో చిన్నారి విశాఖ నగర పరిధిలో ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందినట్టు తెలిసింది. ఈ మేరకు ఇక్కడి పోలీసులు సిబ్బంది అక్కడికి వెళ్లినట్టు ప్రచారంలో ఉంది.

సాగునీటి కాలువల అభివృద్ధే లక్ష్యం

▸▸ నీటి సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్యే కొణతాల

▸▸ ఆక్రమణలు తొలగించాలని అధికారులకు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి కాలువల ద్వారా పంట పొలాలకు నీరందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఇక్కడ జరిగిన నియోజకవర్గ నీటి సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. సాగునీటి కాలువల అభివృద్ధికి మంజూరైన నిధులతో సంఘాల ప్రతినిధులు అభివృద్ధి పనులు చేయించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది గ్రోయిన్లు దెబ్బతిన్నా రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. రెండు నెలల్లో అన్నదాత పథకం కింద రైతుల ఖాతాలకు నిధులు వస్తాయని వివరించారు. మినరల్ సెస్ నిధులు కూడా సాగునీటి కాలువల అభివృద్ధికి మంజూరయ్యాయని చెప్పారు. సాగునీటి కాలువల నీరంతా ఆవఖండం లోకి చేరే అవకాశం ఉన్నందున ప్రస్తుతం ఆవఖండంపై సర్వే చేయించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సాగునీటి కాలువలపై ఆక్రమణలను గుర్తించి తొలగించాలన్నారు. జీవీఎంసీ ఈఈ ఎస్.శేఖరం మాట్లాడుతూ అనకాపల్లి పట్టణ పరిధిలోని యల్లయ్య, నాగులాపల్లి సాగునీటి కాలువల అభివృద్ధికి రూ.50లక్షలు మంజూరయ్యాయని, ఈ నెల చివరిలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డీఈ స్వామినాయుడు, ఏఈ అమూల్య, కూటమి నాయకులు పీలా నాగశ్రీను, చదరం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, చినబాబుకాలనీ పరిధిలో ఉన్న జీవీఎంసీ హెడ్ వాటర్ వర్క్సును ఎమ్మెల్యే పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. ఉడ్‌పేట, సంతబయలు, లక్ష్మీదేవిపేట వంటి ప్రాంతాల్లో సంప్, పంప్ హౌస్, పైపులైన్ల ఏర్పాటుతో సహా 500 కేఎల్‌జీఎల్ఎస్ఆర్ నిర్మాణానికి రెండు రూ.2.5కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ ఎస్.శేఖరం పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో బ్రహ్మోత్సవాలు



పూజలందుకుంటున్న స్వామివారు

పరవాడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఇబోనంగి ఫార్మా పునరావాస కాలనీలోని కొండపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు శ్రీహరి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారికి సుప్రభాతసేవ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, నిత్యాహోమం తదితరాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. ఈనెల 19వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావు తెలిపారు.

సాలాపువానిపాలెంలో పేదలకు దుప్పట్లు పంపిణీ



పేదలకు దుప్పట్ల పంపిణీ చేస్తున్న దృశ్యం

లంకెలపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 84వ వార్డు పరిధి సాలాపువానిపాలెంలో మాజీ సర్పంచ్ సాలాపు సత్యనారాయణ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, ఆయన అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌గా సత్యనారాయణ అందించిన సేవలను వక్తలు కొనియాడారు. మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సాలాపు మోహన్‌రావు, స్థానిక నాయకులు వెంకట అప్పారావు, సూర్య, శివ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలి వెళదాం

▸▸ మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న మహానాడుకు టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్సీ, ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. మహానాడు సభకు వెళ్లేందుకు సన్నాహక చర్యల్లో భాగంగా ఇక్కడి పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. మహానాడుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలు అశేషంగా హాజరై పార్టీకి బాసటగా నిలవాలన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేని వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై అవాకులు, చవాకులు పేలుతుండడం సరికాదన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వానికి, చంద్రబాబు నాయకత్వానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతును ఈ విధంగానే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు జగన్, వెంకటరావు, నాయుడు, శ్రీనివాసరావు, సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

కశింకోట, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెదగుమ్మం వీధిలో ఉన్న గవరపేట శారదా గణపతి రామాలయంలో 4వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ఈ నెల 22 నుంచి 25వచ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన కరపత్రాలను అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళాపరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట దేవినాయుడు, సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఇప్పటికే ఎంట్రీలు పూర్తయిన ఈ పోటీలకు మొత్తం 10 నాటికలను ఎంపిక చేశారు. 22వ తేదీ రాత్రి తొమ్మిది గంటలకు విశాఖపట్నం తెలుగు కళాసమితి వారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటిక, రాత్రి 10.15 గంటలకు కాకినాడ బి.వి.కె. క్రియేషన్స్ వారి 'తితిక్ష' నాటిక, 23వ తేదీ రాత్రి 8.45 గంటలకు కరీంనగర్ చైతన్య కళాభారతి వారి 'చీకటి పువ్వు' నాటిక, రాత్రి 10 గంటలకు గుంటూరు అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక, రాత్రి 11.15 గంటలకు విజయవాడ గురజాడ కళామందిర్ వారి 'మహాప్రస్థానం' నాటిక, 24వ తేదీ రాత్రి 8.45 గంటలకు హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ వారి 'మూల్యం' నాటిక, రాత్రి 10 గంటలకు గుంటూరు జిల్లా కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ వారి 'జనరల్ బోగీలు' నాటిక, రాత్రి 11.15 గంటలకు పెందుర్తి నటరాజ డ్రమెటిక్ అసోసియేషన్ వారి 'శిథిలజీవి' నాటిక, 25వ తేదీ రాత్రి తొమ్మిది గంటలకు గుడివాడ కృష్ణా అండ్ కల్చరల్ అసోసియేషన్ వారి 'ద్వారబంధాల చంద్రయ్యనాయుడు' నాటిక, రాత్రి 10 గంటలకు విశాఖపట్నం జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ వారి 'అనగనగా ఒక రాజు' నాటికను ప్రదర్శిస్తారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ తుహిన్ సిన్హా

విశాఖపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కైలాసగిరిలో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు హెడ్ క్వార్టర్స్ మైదానంలో స్టాఫ్ పరేడ్‌ను అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్కార్ట్ విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తతో ఉండాలని సూచించారు. తీవ్ర నేరాలకు పాల్పడిన నిందితుల విషయంలో వారి నేర చరిత్రను దృష్టిలో పెట్టుకుని మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీలు



అనకాపల్లిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శాంతి

అనకాపల్లి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ మలేరియా విభాగం అధికారిణి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శాంతి ప్రభ పిలుపునిచ్చారు. డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలో పెద్ద ఎత్తున అవగాహ ర్యాలీ నిర్వహించారు. తొలుత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా దోమకాట్లు బారిన పడకుండా దోమతెరలను వినియోగించాలన్నారు. నెహ్రూచౌక్ వరకు సాగిన ఈ ర్యాలీలో దారిపొడవునా కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా మలేరియా అధికారి కె.వరహాల దొర మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి మానవాళికి చాలా ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

తుమ్మపాల : డెంగ్యూపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వాణి జగదీశ్వరి సూచించారు. డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమలను అరికట్టవచ్చునన్నారు. ఆరోగ్యపరమైన సమస్య ఎదురైతే వెంటనే వైద్యాధికారులను సంప్రదించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా నోడల్ అధికారి బి.సంగం, సీహెచ్‌వో శారదా, హెల్త్ ఎడ్యుకేటర్ బి. మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : ఇక్కడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని కశింకోటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో దోమల అభివృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరికైనా తీవ్రమైన జ్వరం, ఎక్కువ తలనొప్పి, కండరాలు, కీళ్లనొప్పులు, వాంతులు, చర్మంపై దద్దుర్లు ఉంటే ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని తాళ్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ జరిపారు. వైద్యాధికారిణి డాక్టర్ ఎమనీషా, ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి.ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకుడు కేఎస్ఆర్‌కే నరసింహారావు పాల్గొన్నారు.



పరవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...



తుమ్మపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...



కశింకోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...

పరవాడ : మండల కేంద్రం పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ జయశ్రీ కరిష్మా, కనక అప్పారావు, ఫాతిమాబేగం మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలను అరికట్టవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సాయిరాం, ఆరోగ్య విస్తరణాధికారి గణేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు వి.సత్యనారాయణ, జానకీరామన్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ వెంకటరావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హై బీపీతో టెన్షన్..టెన్షన్..



సైలెంట్ కిల్లర్‌గా మారుతున్న హైపర్ టెన్షన్‌తో తీవ్ర ఇబ్బందులు

- నానాటికీ భారీగా పెరుగుతున్న బాధితులు
- మారిన జీవనశైలే కారణమంటున్న వైద్య నిపుణులు
- శారీరక శ్రమ, మంచి ఆహారపు అలవాట్లతోనే బీపీ నియంత్రణ సాధ్యం

నేడు వరల్డ్ హైపర్ టెన్షన్ డే

(విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి)

అధిక రక్తపోటుతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గడిచిన కొన్నాళ్లుగా బీపీ రోగులు గణనీయంగా పెరుగుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు పది మందిలో ఒకరికి మాత్రమే ఈ సమస్య ఉంటే... ఇప్పుడు ప్రతి నలుగురిలో ఒకరు హై బీపీతో బాధపడుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడం వంటి అనేక అంశాలు దీనికి కారణమవుతున్నాయి. ఏటా హైపర్ టెన్షన్ బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలనే ఉద్దేశంతో ఏటా మే 17న వరల్డ్ హైపర్ టెన్షన్ డే జరుపుతున్నారు. ఏటా మాదిరిగానే ఈసారి కూడా ప్రత్యేకమైన థీమ్‌తో దీనిని నిర్వహిస్తున్నారు. 'బీపీని సరిగ్గా గుర్తించండి.. నియంత్రణలో ఉంచుకుని దీర్ఘకాలం జీవించండి' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.



భారీగా బాధితులు..

30 ఏళ్లు దాటిన ప్రతి నలుగురిలో ఒకరు హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో 20 ఏళ్లు దాటిన యుక్త వయస్కుల్లోనూ ఈ సమస్య కనిపిస్తున్నట్టు పేర్కొంటున్నారు. హైపర్ టెన్షన్ సైలెంట్ కిల్లర్‌గా మారుతుండడంతో ప్రజలను అప్రమత్తం చేసే ఉద్దేశంతో వందకుపైగా దేశాల్లో హైపర్ టెన్షన్ లీగ్ ఆధ్వర్యంలో ఈ డేను నిర్వహిస్తూ వస్తున్నారు. 2006 నుంచి ప్రతి సంవత్సరం ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

రక్తనాళాల్లో ఒత్తిడితో..

రక్తనాళాల్లో ఒత్తిడి కారణంగా అత్యధికులు హైబీపీ బారినపడుతున్నట్టు పలువురు వైద్యులు పేర్కొంటున్నారు. సాధారణంగా మనిషి తన జీవన యాత్రను సజావుగా సాగించాలంటే రక్తప్రసరణ వ్యవస్థ సక్రమంగా ఉండాలి. శరీరంలోని అన్ని అవయవాలకు రక్త సరఫరా నిరంతరం ఒకే విధంగా జరుగుతూ ఉండాలి. అయితే రక్త ప్రసరణ జరిగే క్రమంలో కలిగే ఒత్తిడి పరిధికి మించితే రక్తపోటుగా మారుతుంది. సాధారణంగా రక్త ప్రసరణ జరిగేటప్పుడు ప్రతి మనిషి రక్తపోటు 120/80 కంటే తక్కువగా ఉండాలి. ఒకవేళ అంతకంటే ఎక్కువగా ఉంటే దానిని అధిక రక్త పోటుగా పరిగణిస్తారు. 130/85 దాటితే రక్తపోటు వస్తున్నట్టుగా భావించాల్సి ఉంటుంది. 130-139/80-90 ఉంటే స్టేజ్-1 హైపర్ టెన్షన్‌గా భావించాల్సి ఉంటుంది. అలాగే, 140/90 ఉంటే స్టేజ్-2 హైపర్ టెన్షన్‌గా చెబుతారు. 180/120 ఉంటే హైపర్ టెన్సివ్ క్రైసిస్‌గా చెబుతారని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రాణాలను హరించే ముప్పు..

హైపర్ టెన్షన్ వల్ల ప్రాణాలను హరించే ముప్పు పొంచి ఉంటోందని నిపుణులు అంటున్నారు. ఓ వ్యక్తిని తనకు తెలియకుండానే మృత్యుఒడికి చేరుస్తుంది కాబట్టే దీన్ని సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు, నగరాల్లో ప్రతి నలుగురిలో ఒకరు హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్న వాళ్లే ఉన్నారు. నిత్యం ఉద్యోగంలో తలమునకలై ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల ముందుగా హైపర్ టెన్షన్ దరి చేరుతుందని నిపుణులు చెబుతున్నారు. హైపర్ టెన్షన్ బారినపడితే బ్రెయిన్ స్ట్రోక్స్, పెరాలసిస్ స్ట్రోక్స్, గుండెపోటు, కిడ్నీలు పాడవ్వడం వంటి రుగ్మతలన్నీ చుట్టుముట్టే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏటా ప్రపంచ వ్యాప్తంగా సుమారు ఎనిమిది మిలియన్ల మంది హైపర్ టెన్షన్ బారినపడి మృత్యువాత చెందుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



ఇవీ కారణాలు..

హైపర్ టెన్షన్ బారినపడేందుకు అనేక అంశాలు దోహదం చేస్తున్నాయి. ఫ్యామిలీ హిస్టరీ, జన్యుపరమైన కారణాలు, అదుపులేని శరీర బరువు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఆహారంలో అధికంగా ఉప్పు తీసుకోవడం, మద్యం తాగడం, పొగ తాగడం, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం లేకపోవడం, ఒకేచోట కూర్చుని ఎక్కువ సమయం పనిచేయడం, కనీస వ్యాయామం చేయకపోడం, పెయిన్ కిల్లర్, స్టెరాయిడ్స్ అధికంగా వాడడం, గర్భనిరోధక మాత్రలు అధికంగా వినియోగించే వాళ్లు ఈ సమస్య బారినపడే అవకాశం ఉంది.

గుర్తించడం ఎలా?

హై బీపీ పట్ల అవగాహన ఉన్నప్పుడే సకాలంలో గుర్తించడం సాధ్యమవుతుంది. 30 ఏళ్లు దాటిన వాళ్లు ఏడాదికొకసారి తప్పనిసరిగా బీపీ పరీక్ష చేయించుకోవాలి. కళ్లు తిరగడం, తల వెనక భాగంలో నొప్పి రావడం వంటి లక్షణాలుంటే అప్రమత్తం కావాలి. కిడ్నీ జబ్బులు, థైరాయిడ్, అడ్రినల్ వంటి జబ్బులున్నవాళ్లు తరచూ వైద్యుడి వద్దకు వెళ్లి పరీక్ష చేయించుకోవాలి.

జాగ్రత్తలతో చెక్..

హైపర్ టెన్షన్ బారినపడకుండా జీవన విధానంలో కొన్ని మార్పులు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పోషకాహారాన్ని తీసుకోవడం, వారంలో కనీసం ఐదు రోజులపాటు కనీసం అర్ధ గంట వ్యాయామం చేయడం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, ఆహారంలో ఉప్పు వినియోగాన్ని తగ్గించడం, ఏరోబిక్ ఎక్సైర్‌సైజ్‌లు చేయడం, ఉప్పు అధికంగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండడం, ఫైబర్ అధికంగా ఉండే ఆకుకూరలు, పండ్లు తీసుకోవడం చేయాలి. యోగా, మెడిటేషన్ వంటివి కూడా ఉపయోగపడతాయి.

నిర్లక్ష్యంతోనే పెను ప్రమాదం



హైపర్ టెన్షన్ విషయంలో నిర్లక్ష్యం పనికిరాదు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే పెను ప్రమాదానికి దారి తీయవచ్చు. బీపీ ఒకసారి జీవితంలో వచ్చిందంటే తగ్గదు. కేవలం ఇది పెరగకుండా మాత్రమే చూసుకోవాలి. అధిక బీపీ వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. బీపీ వల్ల అనేక మంది హార్ట్ ఎటాక్‌కు గురై మృతి చెందుతున్నారు. బీపీని కేవలం మందులతోనే కాకుండా సరైన ఆహారపు అలవాట్లతో కూడా నియంత్రణలో ఉంచుకోవచ్చు. అధిక ఒత్తిడే తీవ్రమైన రక్తపోటుకు కారణమవుతుంది. తీవ్రమైన తల నొప్పి, ఛాతీ నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వికారం, వాంతులు, అస్పష్టమైన దృష్టి లేదా ఇతర దృష్టి మార్పులు, ఆందోళన, గందరగోళం, చెవుల్లో శబ్దాలు, ముక్కు నుంచి రక్తస్రావం కావడం వంటివన్నీ హైపర్ టెన్షన్ లక్షణాలుగా గుర్తించాలి. ప్రజలకు ఈ వ్యాధి పట్ల అవగాహన లేకపోవడమే అనేక అనర్థాలకు కారణమవుతోంది. కాబట్టి అప్రమత్తతో వ్యవహరించడం ఎంతైనా మంచిది.

-డాక్టర్ అశ్విన్‌కుమార్ పాండా, కార్డియాలజిస్టు, మెడికవర్ ఆస్పత్రి

క్రైం... crime news

వాటర్ ట్యాంకర్ బోల్తా : డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవర్ బిమేష్

ముంచంగిపుట్టు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ బిర్రుగూడ గ్రామ సమీపంలో శుక్రవారం వాటర్ ట్యాంకర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీపురం పంచాయతీ సంగంవలస గ్రామానికి చెందిన అల్లంగి బిమేష్(21) బిర్రుగూడలో జరుగుతున్న వంతెన పనుల నిమిత్తం శుక్రవారం ట్యాంకర్‌తో నీటిని తీసుకువెళుతున్నాడు. మార్గమధ్యలో బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో ట్యాంకర్ బోల్తా పడి, డ్రైవర్ బిమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పంచాయతీ సర్పంచ్ కె.త్రినాథ్, వైసీపీ నేత సాధురాం సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బిమేష్‌కు ఇటీవలే వివాహం అయ్యింది. దీంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య దొయిమెత్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జె.రామకృష్ణ తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైక్ : ఒకరి మృతి



మృతి చెందిన వరహాలబాబు(ఫైల్)

గొలుగొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఒక వ్యక్తి గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జోగంపేట గ్రామానికి చెందిన గుడివాడ వరహాలబాబు(43) ఈనెల 14వ తేదీ రాత్రి పది గంటల సమయంలో జోగంపేట జంక్షన్ నుంచి గొలుగొండ వెళుతుండగా రైస్‌మిల్లు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో వరహాలబాబు తలకు, ముఖానికి బలంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 15వ తేదీ రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి శ్రీరామ్మూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ రామారావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం షాపులో షార్ట్ సర్క్యూట్.. రూ.4 లక్షల ఆస్తి నష్టం



దుకాణంలో దగ్ధమైన మద్యం బాక్సులు

ఎలమంచిలి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లైనుకొత్తూరు సమీపంలో వున్న ఒక మద్యం దుకాణంలో శుక్రవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో మంటలు ఏర్పడి మద్యం బాక్సులకు అంటు కున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. సుమారు 4 లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్టు మద్యం షాపు నిర్వాహకులు బొద్దపు శ్రీను, నానాజీ, సన్యాసినాయుడు వాపోయారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి

- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



వైద్యాధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాత, శిశు మరణాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రజా సర్వే, మాతాశిశు మరణాలు, వ్యాధి నిరోధక టీకాలు, మలేరియా, డెంగ్యూ తదితర అంశాలపై వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నూతన దంపతులు, గర్భిణులు, శిశువుల నమోదును సక్రమంగా చేయాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. గర్భిణుల్లో హైరిస్క్ కేసులను డెలివరీ తేదీకి వారం ముందుగానే సమీపంలోని ఆస్పత్రికి తరలించి, వైద్యుల పర్యవేక్షణలో వుంచాలని సూచించారు. దీనివల్ల మాతాశిశు మరణాలను నివారించవచ్చని కలెక్టర్ చెప్పారు. లింగ నిర్ధారణతోపాటు గర్భస్రావాలు (అబార్షన్లు) అధికంగా చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా పెట్టాలని, అబార్షన్‌లకు గల కారణాలపై నివేదిక అందించాలన్నారు. మలేరియా, డెంగ్యూకు కారణమయ్యే దోమల నివారణ కోసం వారంలో ఒక రోజు 'డ్రై డే' పాటించాలని చెప్పారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులను ఆస్పత్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 104 వాహనాల ద్వారా అందిస్తున్న సేవలు ప్రజలకు సక్రమంగా అందేలా వైద్యాధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో ఎం.శాంతిప్రభ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు మరింత ఛిద్రం

... 5వ పేజీ తరువాయి

ప్రయాణిస్తున్నామా? లేకపోతే పొలాల్లో నుంచి వెళుతున్నామా? అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. చోడవరం మండలంలో గంధవరం నుంచి బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వరకు రహదారి పలుచోట్ల దెబ్బతిన్నది. గోతుల కారణంగా వాహనాలు నడిపే వారితోపాటు ప్రయాణిం చేవారి ఒళ్లుహూనం అవుతున్నది. వాహనాల విడిభాగాలు పాడైపోతున్నాయి. ద్విచక్ర వాహనంపై భార్య, పిల్లలతో ఈ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే బంబేలెత్తిపోతు న్నారు. బీఎన్ అభివృద్ధి, విస్తరణ పనులు ఇదిగో ప్రారంభంఅవుతాయి.. అదిగో మొదలవుతాయి అంటూ పది నెలల నుంచి కూటమి నేతలు చెబుతున్నారు. కానీ ఇంత వరకు కదలిక లేదు. శాశ్వత స్థాయిలో పనులు జరిగే వరకు, కనీసం గోతులు అయితే కప్పాలని వాహనదారులు కోరుతున్నారు.

మునిసిపల్ వైస్‌చైర్మన్లపై అవిశ్వాస నోటీసు తిరస్కరణ

... 5వ పేజీ తరువాయి

ఈ నెల 9వ తేదీన మునిసిపల్ కమిషనర్‌కు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆయన ఈ నోటీసును జిల్లా కలెక్టర్ ఆమోదం కోసం పంపారు. అయితే ఆ సమయంలో కలెక్టర్ సెలవులో వున్నారు. ఆమె శుక్రవారం తిరిగి విధుల్లో చేరిన తరువాత నోటీసులో వున్న కౌన్సిలర్ల పేర్లు, సంతకాలను పరిశీలించారు. నోటీసు అసంపూర్తిగా వుందని, సంతకాల్లో కూడా తేడాలు వున్నాయని భావించిన కలెక్టర్.. అవిశాన నోటీసును తిరస్కరించారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్‌కు సమాచారం అందింది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

22న అడ్డరోడ్డులో మినీ మహానాడు

- విజయవంతానికి అంకితభావంతో పనిచేయాలి
- 'పేట టీడీపీ శ్రేణులతో హోం మంత్రి అనిత సమావేశం



మినీ మహానాడుపై నాయకులతో సమావేశమైన హోం మంత్రి అనిత

నక్కపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డులో మే 22న నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ జిల్లా మినీ మహానాడును విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. మినీ మహానాడు ఏర్పాట్లపై శుక్రవారం తన నివాసంలో పాయకరావుపేట నియోజకవర్గం నాయకులతో చర్చించారు. మినీ మహానాడుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు హాజరవుతారని చెప్పారు. జనసమీకరణ, సభావేదిక నిర్మాణం, అలంకరణ, భోజన, వసతి, వాహనాల పార్కింగ్, తదితర పనులు చేపట్టేందుకు కమిటీలు వేశారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, నియోజకవర్గం ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

ఈసెట్‌లో 'అనకాపల్లి అగ్రి'కి ర్యాంకుల పంట

- మొదటి పదింటిలో ఎనిమిది కైవసం
- వీరిలో ఆరుగురు బాలికలే!



డి.నళిని 1వ ర్యాంకు; గండి భావన 3వ ర్యాంకు; ఇ.సాయి 4వ ర్యాంకు; ఎం.కీర్తి స్వరూప 5వ ర్యాంకు; పి. గురుసాయి 6వ ర్యాంకు; కె. సాయి హర్షిణి 7వ ర్యాంకు; ఎం.దీపిక 8వ ర్యాంకు; జి.మణిరత్నం 9వ ర్యాంకు

అనకాపల్లి అగ్రికల్చర్, మే 16 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ-అనంతపురం) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఏపీ ఈసెట్-2025 ఫలితాల్లో అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ పాలిటెక్నిక్ కళాశాల అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. మొదటి పది ర్యాంకుల్లో ఎనిమిది ర్యాంకులను వీరే సాధించి కళాశాల ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. వీరిలో ఆరుగురు బాలికలు ఉండడం విశేషం. డి.నళిని ప్రథమ ర్యాంకు, జి.భావన 3వ ర్యాంకు, ఇ.సాయి సుదర్శిని 4వ ర్యాంకు, ఎం.కీర్తి స్వరూప 5వ ర్యాంకు, పి. గురుసాయి 6వ ర్యాంకు, కె.సాయి హర్షిణి 7వ ర్యాంకు, ఎం.దీపిక 8వ ర్యాంకు, జి.మణిరత్నం 9వ ర్యాంకు సాధించారు. ఇదే కళాశాలకు చెందిన ఎం.జాహ్నవి రాణి 12వ ర్యాంకు, త్రిషాదేవి 13వ ర్యాంకు, గ్లోరిమాషెరూన్ 14వ ర్యాంకు, జి.రక్షిత 17వ ర్యాంకు, ఎం.రాహుల్ 23, ఎస్.ప్రిన్స్ 25, ఎన్.లావణ్య 29, పి. దివ్య 36, పి.రేష్మ 39, సిహెచ్.శ్రీనివాసరావు 40, పి.దేవీఅమృత 42, వైవీఎస్ ప్రశాంత్ 47వ ర్యాంకు పొందారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, ఏడీఆర్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశ సరిత, అధ్యాపకులు అభినందించారు.

భూ సమీకరణలో గోల్‌మాల్!

... 5వ పేజీ తరువాయి

ఉంది. ఈ భూమి ప్రభుత్వ వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఇప్పటికీ ప్రభుత్వ బంజరుగానే నమోదై ఉంది. పరిహారం చెల్లింపులకు సంబంధించిన ఫైలు అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం నుంచే కదిలింది. గతంలో తహసీల్దారు సమర్పించిన నివేదిక ఆధారంగా మొత్తం వ్యవహారం నడిపించినట్టు తెలిసింది. కూటమి నేత ఒకరు తెర వెనుక ఉండడంతో ఒక ముఖ్య అధికారి ఆదేశాలతో భూసమీకరణ పరిహారం చెల్లింపుల ఫైలు చకచకా కదిలిందని సమాచారం.

ఆర్డీఓ కార్యాలయంలో వివరాలు లేవట!

కోడూరులో భూ సమీకరణ కోసం భూముల ఇచ్చిన రైతుల వివరాలు, ఎంత మొత్తం చెల్లింపులు జరిగాయనే వివరాలు తమవద్ద లేవని, తహసీల్దారు కార్యాలయంలో ఉంటాయని ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీనివాసరావు, అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్ సుధాకర్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. అనకాపల్లి తహసీల్దారు విజయ్‌కుమార్‌ను వివరాలుఅడగ్గా.. ఆర్డీఓ కార్యాలయం ద్వారానే పరిహారం చెల్లింపులు జరిగాయని, తాను బాధ్యతలు చేపట్టక ముందే ఫైలు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లిందని చెబుతున్నారు. మొత్తం వ్యవహారంలో అధికారుల తీరు అనుమానాలకు తావిస్తున్నది. ప్రభుత్వ భూమిని వేరే వ్యక్తుల సాగులో వున్నట్టు రికార్డుల్లో చూపించి ఆరు కోట్లరూపాయాలకుపైగా ప్రజా ధనాన్ని దోచిపెట్టిన/ దోచుకున్న వారిపై ఉన్నతస్థాయి అధికారులు లోతుగా విచారణకు జరిపిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. కాగా కోడూరులో భూసమీకరణ పేరుతో సాగిన అక్రమ చెల్లింపులపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాలకు, సీసీఎల్ఏకు ఫిర్యాదు చేసేందుకు సీపీఐ, సీపీఎం నాయకులు సిద్ధమవుతున్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టేవారిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. దేశ రక్షణ కోసం వీరోచితంగా పోరాటం చేసే క్రమంలో మన రాష్ట్రానికి చెందిన మురళీనాయక్ అమరుడు కావడం చాలా బాధాకరమన్నారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సైనికులను ఆమె సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గెడ్డం బుజ్జి, తోట నగేశ్, లాలం కాశీ నాయుడు, కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్ధం, పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు

మినీ స్టేడియం అధ్వానం

... 5వ పేజీ తరువాయి

ముందున్న మునిసిపాలిటీ షాపింగ్ కాంప్లెక్ పడగొట్టారు. ప్రహరీ గోడ నిర్మించకుండా వదలేశారు. డివైడర్ల మీద ఉన్న మూడు విగ్రహాలను స్టేడియంలోకి తరలించడానికి వాకింగ్ ట్రాక్ కాంక్రీట్ గట్టును ధ్వంసం చేశారు. ఇప్పటికే అలాగే వుండడంతో కొంత మంది ఆకతాయిలు ద్విచక్రవాహనాలతో ఆ మార్గం నుంచి స్టేడియంలోకి వచ్చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా...

స్టేడియం ముందు భాగంలో మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలు తీసేయడం వల్ల రక్షణ లేకుండా పోయింది. మందుబాబులకు, గంజాయి సేవించే వారికి అడ్డాగా మారింది. ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు పడేస్తున్నారు. ఆహార వ్యర్థాలను బెంచీల మీద వదిలేస్తున్నారు. గతంలో స్టేడియంలో వాచ్‌మన్ ఉండేవాడు. ఐదు నెలలుగా వాచ్‌మన్ లేకపోవడంతో రక్షణ కొరవడింది. ఆకతాయిలు సిమెంట్ బెంచీలు ధ్వంసం చేస్తున్నారు. గతంలో స్టేడియం ముందు మునిసిపల్ దుకాణాల్లో వ్యాపారం చేసుకున్న వారంతా ఇప్పుడు స్టేడియం లోపల ఆక్రమణకు పాల్పడుతున్నారు. గత ప్రభుత్వంలో క్రీడా మైదానం ఆక్రమణకు గురవుతున్నా... అప్పటి మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇప్పుడున్న అధికారులు సైతం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ సురేంద్రను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. స్టేడియం అభివృద్ధికి ప్రణాళికను రూపొందిస్తున్నామని, స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టి పెట్టారని తెలిపారు.

సీల్డ్ కవర్‌లో డిప్యూటీ మేయర్ పేరు!

... 5వ పేజీ తరువాయి

పల్లా శ్రీనివాసరావు (గాజువాక ఎమ్మెల్యే కాదు) పేర్లతో కూడిన జాబితాను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి అందజేయనున్నారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన మేయర్ పీఠం నుంచి గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాసం పెట్టి ఆమె స్థానంలో పీలా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. అందువల్ల డిప్యూటీ మేయర్ పోస్టును యాదవ సామాజిక వర్గానికి మహిళనే ఎంపిక చేయాలని పలువురు పట్టుబడుతున్నా.. నగరంలో మరో బలమైన సామాజిక వర్గమైన కాపుల నుంచి ఒకరికి ఇచ్చి తీరాలనే వాదన బలంగా ఉంది.